
ఆంధ్రజ్యోతి

ANDHRAJYOTHY

సంగారెడ్డి 5 మెదక్

జిల్లాల వార్తలు

శుక్రవారం 25 అక్టోబరు 2024



కాలక్షేపానికి నెలవు

## రాయరావు చెరువు

పచ్చని చెట్లు.. ఆహ్లాదమైన వాతావరణం

- చెరువు కట్టపై ఓపెన్‌జిమ్ ఏర్పాటు
- మరింత తీర్చిదిద్దితే పెరగనున్న పర్యాటకుల తాకిడి

8



ఎమ్మెస్సీ ఫిషరీస్ విభాగం మ్యూజియంలో భద్రపరిచిన వివిధ రకాల చేపల నమూనాలు

# చేపల ప్రయోగశాల

సిద్దిపేటలో రాష్ట్రంలోనే మొదటి పీజీ కోర్సు

- అందుబాటులో ఎమ్మెస్సీ ఫిషరీస్
- పరిశోధనతో పాటు ఉపాధి మార్గాలు
- చేపల కొలను, ప్రత్యేక మ్యూజియం
- ఆక్వా క్లినిక్స్ ద్వారా ఫీడ్, సీడ్

7


రాష్ట్రంలో ఫిషరీస్‌లో పీజీ స్థాయి కోర్సు సిద్దిపేటలో ఉండడం విశేషం. పట్టణంలోని ప్రభుత్వ డిగ్రీ కళాశాల అనుబంధ పీజీ కాలేజ్‌లో ఎమ్మెస్సీ ఫిషరీస్ అందుబాటులో ఉంది. లెక్చరర్ల ప్రోత్సాహంతో ఇక్కడి విద్యార్థులు మత్స్య సంపదను కాపాడేందుకు కొత్త మార్గాలను అన్వేషిస్తూ, సరికొత్త పరిశోధనలకు నాంది పలుకుతున్నారు. ఈ విభాగంలో ప్రత్యేక మ్యూజియం ఏర్పాటు చేసి సుమారు 400 రకాల చేపల నమూనాలను భద్రపరిచారు. ఇక్కడి ఆక్వా క్లినిక్‌లో చేప వ్యాధులకు మందులను అందించడమే కాకుండా, చేప విత్తనం సరఫరాతో పాటుగా వాటికి అవసరయ్యే ఆహారాన్ని ఇస్తున్నారు.

# విలీనంపై వివాదం




## తెరమీదకు జిల్లాలు, జోన్ల మార్పు అంశం

- చార్మినార్ జోన్‌లో కలపాలని సిద్దిపేట, మెదక్ జిల్లాల్లో డిమాండ్
- ఉద్యోగాలు, పదోన్నతుల ఆలస్యంపై అభ్యంతరాలు
- కరీంనగర్‌వైపే హుస్నాబాద్ ప్రజల చూపు
- మెదక్ కన్నా సంగారెడ్డినే మిన్నగా మూడు మండలాలు
- మార్పులు, చేర్పులపై మళ్లీ ఉత్కంఠ




మల్టీజోన్-1లోని రాజన్న జోన్

ఆంధ్రజ్యోతి ప్రతినిధి, సిద్దిపేట, అక్టోబరు 24 : ఎనిమిదేళ్ల క్రితం ఏర్పాటైన జిల్లాలు, మూడేళ్ల కిందట విభజించిన జోన్లపై తాజాగా వివాదం మొదలైంది. జిల్లాలు, జోన్ల విషయంలో మార్పులు, చేర్పులు చేపట్టాలనే డిమాండ్ తెరమీదకొచ్చింది. ఒకప్పుడు హైదరాబాద్‌కు అనుసంధానమైన జోన్‌లో ఉన్న ఉమ్మడి మెదక్ జిల్లాను మూడు జిల్లాలుగా విభజించిన విషయం తెలిసిందే. ఈ ప్రక్రియలో శాస్త్రీయంగానే మండలాలను అటు ఇటుగా మార్చినప్పటికీ కొన్ని మండలాల విషయంలో నాటి నుంచి అభ్యంతరాలు వ్యక్తమవుతున్నాయి. దీనికితోడు కొత్త జోన్‌పై సిద్దిపేట, మెదక్ జిల్లాల ఉద్యోగులు, నిరుద్యోగులు అసంతృప్తితో ఉన్నారు. ప్రస్తుతం రాష్ట్రంలో కాంగ్రెస్ పార్టీ అధికారంలో ఉన్నందున జిల్లాలు, జోన్ల మార్పు అంశాన్ని పరిశీలించాలనే విన్నపాలు వ్యక్తమవుతున్నాయి.

### చార్మినార్ జోన్‌లో కలపాలని

ఉమ్మడి మెదక్ జిల్లాను సంగారెడ్డి, సిద్దిపేట, మెదక్ జిల్లాలుగా విభజించారు. అయితే సంగారెడ్డి జిల్లాను మల్టీజోన్-2లోని చార్మినార్ జోన్‌లో విలీనం చేయగా.. సిద్దిపేట, మెదక్ జిల్లాలను మాత్రం మల్టీజోన్-1 లోని రాజన్న సిరిసిల్ల జిల్లాలో కలిపారు. రాష్ట్ర రాజధాని హైదరాబాద్‌తో పాటు ఉంటే ఉద్యోగ అవకాశాలతోపాటు ప్రమోషన్లు త్వరగా దక్కుతాయని ప్రస్తుతం సిద్దిపేట, మెదక్ జిల్లాల నిరుద్యోగులు, ఉద్యోగులు భావిస్తున్నారు. చార్మినార్ జోన్‌లో ఉన్న సంగారెడ్డితోపాటే ఈ రెండు జిల్లాలను కూడా విలీనం చేయాలనే డిమాండ్ ఎక్కువైంది. హైదరాబాద్‌కు సమీపంలో ఉన్న సిద్దిపేట, మెదక్‌ను ఎక్కడో ఉన్న ఆదిలాబాద్, నిజామాబాద్, ఖమ్మం జిల్లాలతో ముడిపెట్టారని అభ్యంతరం తెలుపుతున్నారు. ఇక రాజన్న సిరిసిల్ల జోన్‌లోని కరీంనగర్, కామారెడ్డి, సిరిసిల్ల జిల్లాలతో సిద్దిపేట, మెదక్‌కు పొంతన లేదని అంటున్నారు. ఈ రెండు జిల్లాల ప్రజలు, ఉద్యోగులు అధిక శాతం హైదరాబాద్‌తోనే సన్నిహిత సంబంధాలు, భవిష్యత్తులో స్థిర నివాస

తరువాయి 7వ పేజీలో

# వార్డు కమిటీల కథ కంచికేనా?

సంగారెడ్డి జిల్లాలో 8 మునిసిపాలిటీలు



సంగారెడ్డి మునిసిపల్ కార్యాలయం

సంగారెడ్డి టౌన్, అక్టోబరు 24 (ఆంధ్రజ్యోతి): మునిసిపాలిటీలలో ఏర్పాటు చేసిన వార్డు కమిటీలు నామమాత్రంగా మారాయి. వార్డుల్లో చేపట్టిన అభివృద్ధి పనులను పర్యవేక్షించడంతో పాటు సమస్యలను అధికారుల దృష్టికి తీసుకువెళ్లాలన్న ఉద్దేశంతో 2021లో నాలుగు రకాల వార్డు కమిటీలను నియమించారు. మొదట్లో ఉత్సాహంగా పనిచేసిన కమిటీల సభ్యులు ప్రోత్సాహం లేకపోవడంతో నామమాత్రమయ్యాయి. వార్డు కమిటీల సభ్యులపై రాజకీయ ఒత్తిళ్ల కారణంగా వారిలో పనిచేయాలన్న ఉత్సాహం తగ్గిందన్న అభిప్రాయాలు వ్యక్తమవుతున్నాయి. ఫలితంగా వార్డుల్లో అభివృద్ధి పనులు ఇతర కార్యక్రమాల పర్యవేక్షణను పట్టించుకునే నాథుడే కరువయ్యారు.

### నాలుగు రకాల కమిటీల్లో 3,184 సభ్యులు

సంగారెడ్డి జిల్లాలో మొత్తం 8 మునిసిపాలిటీలు, 199 వార్డులున్నాయి. సంగారెడ్డి గ్రేడ్‌వన్ మునిసిపాలిటీతో పాటు అమీన్‌పూర్, తెల్లాపూర్, ఐడీఏ బొల్లారం, సదాశివపేట, జహీరాబాద్, అందోలు-జోగిపేట, నారాయణఖేడ్ బల్దియాలున్నాయి. ఈ మునిసిపాలిటీల్లో నాలుగు రకాల కమిటీల్లో 3,184 మంది సభ్యులకు స్థానం కల్పించారు. ఒక్కో వార్డుకు 20 మంది చొప్పున ఈ కమిటీలను వేశారు. ఇందులో యువత, మహిళలు, ప్రముఖులు, సీనియర్ సిటిజన్లకు భాగస్వామ్యం కల్పించారు. ఈ నాలుగు రకాల కమిటీలకు అధ్యక్షులుగా వార్డు కౌన్సిలర్లు ఉన్నారు. ఈ కమిటీల సభ్యులు ప్రతీ నెలల మూడు నెలలకొకసారి సమావేశం నిర్వహించి వార్డుల్లోని సమస్యలపై

తరువాయి 8వ పేజీలో

## మహిళాసాధికారతకు డీడీఎస్ కృషి

డీడీఎస్ చైర్మన్, ప్రొఫెసర్ బీపీ సంజయ్

సభ్యులతో వర్చువల్ సమావేశం



పస్తాపూర్‌లోని డీడీఎస్‌లో నిర్వహించిన సమావేశంలో మట్లాడుతున్న మహిళా సంఘాల సభ్యురాలు

7

ప్రభుత్వ ఆస్పత్రి ఆవరణలో

## మృతదేహం కలకలం

హత్య చేసి ఆనవాళ్లు తెలియకుండా దహనం చేసే యత్నం!

7

ఆలయాల్లో చోరీ

## నిందితుల అరెస్టు

## కాంగ్రెస్, బీఆర్ఎస్ నాయకుల బాహాబాహీ

- కొనుగోలు కేంద్రం ప్రారంభంలో ఘర్షణ
- ఇరువర్గాల మధ్య తోపులాట
- పోటాపోటీ నినాదాలు.. శాంతింపజేసిన పోలీసులు

7



శివ్వంపేటలో కొనుగోలు కేంద్రం ప్రారంభోత్సవంలో వాగ్వాదానికి దిగిన నాయకులు



మెడికల్ కాలేజీని ప్రారంభిస్తున్న మంత్రులు, ఎమ్మెల్యే, ఎమ్మెల్సీ, కలెక్టర్ తదితరులు

# పేదలకు సూపర్ స్పెషాలిటీ సేవలు

- 90 శాతం వైద్యం స్థానికంగానే అందాలి
- 40 రోజుల్లో వైద్య కళాశాల శాశ్వత భవనానికి భూమిపూజ
- వచ్చే ఏడాది నర్సింగ్, పారా మెడికల్ కళాశాల
- మెదక్‌లో 20 ఎకరాల్లో 220 పడకల ఆసుపత్రి
- వైద్య ఆరోగ్యశాఖ మంత్రి దామోదర్ రాజనర్సింహ
- ఫ్రెండ్లీ డాక్టర్లుగా రోగులకు సేవలందించాలి
- ఇన్‌చార్జి మంత్రి కొండా సురేఖ

మెదక్/మెదక్ అర్బన్, అక్టోబరు 24 (ఆంధ్రజ్యోతి): పేదలందరికీ సూపర్ స్పెషాలిటీ వైద్య సేవల అందించడమే తమ ప్రభుత్వ ప్రధాన లక్ష్యమని వైద్య ఆరోగ్యశాఖ మంత్రి దామోదర్ రాజనర్సింహ పేర్కొన్నారు. మెదక్‌లో ఏర్పాటు చేసిన మెడికల్ కాలేజీలో మొదటి బ్యాచ్ తరగతులను గురువారం ఆయన జిల్లా ఇన్‌చార్జి మంత్రి, అటవీ, దేవాదాయశాఖ మంత్రి కొండా సురేఖ, ఎంపీ రఘునందన్‌రావు, ఎమ్మెల్యే డా. మైనంపల్లి రోహిత్‌రావు, ఎమ్మెల్సీ శేరి సుభాష్‌రెడ్డి, జిల్లా కలెక్టర్ రాహుల్‌రాజ్‌తో కలిసి ప్రారంభించారు. అనంతరం మాట్లాడుతూ వైద్య కళాశాల ఏర్పాటుకు అనుమతుల మంజూరులో ఎన్‌ఎంసీ కఠిన నిబంధనల దృష్ట్యా కొంత ఆలస్యం జరిగినా.. ఎమ్మెల్యే, ఎంపీ సహకారంతోపాటు సీఎం రేవంత్‌రెడ్డి కృషితో రెండో విడతలో మెదక్ మెడికల్ కాలేజీకి అనుమతి వచ్చిందన్నారు. దశాబ్దాలుగా ఎదురుచూస్తున్న జిల్లాకు మెడికల్ కళాశాల రావడం సంతోషకరమని పేర్కొన్నారు. రాజకీయాలు శాశ్వతం కాదని, ప్రజలకు వైద్యం, విద్య, సంక్షేమం అందించాలన్నదే ప్రభుత్వ ప్రధాన లక్ష్యమన్నారు. వైద్యం కోసం ప్రజలు హైదరాబాద్, సికింద్రాబాద్‌కు వెళ్లాల్సిన అవసరం లేకుండా స్థానికంగానే సూపర్‌స్పెషాలిటీ సేవల అందించడం కోసం ఆస్పత్రులను అభివృద్ధి చేస్తున్నామని చెప్పారు. వైద్య వృతిలో రోగులకు నాణ్యమైన సేవలు అందించడమే తృప్తిగా ఉంటుందన్నారు. 220 పడకల ఆసుపత్రి శాశ్వత భవన నిర్మాణానికి 40 రోజుల్లో భూమి పూజ చేస్తామన్నారు. ఇప్పటికే 20 ఎకరాల్లో స్థలాన్ని గుర్తించామని తెలిపారు. వచ్చే విద్యా సంవత్సరం నుంచి నర్సింగ్, పారా మెడికల్ కళాశాల ప్రారంభిస్తామని మంత్రి తెలిపారు.

### టెక్నాలజీని అందిపుచ్చుకోవాలి

మెడికోలు వైద్య వృత్తికి న్యాయం చేయాలని

తరువాయి 8వ పేజీలో

### సమన్వయంతో పనిచేయాలి

- లోటుపాట్లను సరిదిద్దుకోవాలి
- మంత్రి దామోదర్ రాజనర్సింహ
- జిల్లా అభివృద్ధిపై అధికారులతో సమీక్ష

మెదక్, అక్టోబరు 24 ( ఆంధ్రజ్యోతి): ధాన్యం కొనుగోళ్లలో క్షేత్రస్థాయిలో ఎదురయ్యే సమస్యలను ఎప్పటికప్పుడు పరిష్కరించుకుంటూ ముందుకుసాగాలని మంత్రి దామోదర్ రాజనర్సింహ అధికారులను ఆదేశించారు. మెదక్‌లో మెడికల్ కాలేజీని ప్రారంభించిన అనంతరం గురువారం సాయంత్రం ఆయన వైద్య, వ్యవసాయ, జిల్లా గ్రామీణాభివృద్ధి, మార్కెటింగ్‌శాఖల అధికారులతో జిల్లా ఇన్‌చార్జి మంత్రి కొండా సురేఖతో కలిసి సమీక్షా సమావేశం నిర్వహించారు. కొనుగోలు కేంద్రాల నిర్వహణ, ధాన్యం రవాణాకు తీసుకుంటున్న చర్యలను అడిగి తెలుసుకున్నారు. రుణమాఫీకి సంబంధించి లబ్ధిపొందిన రైతుల వివరాలు, ఇంకా ఎంతమందికి రుణమాఫీ చేయాల్సి ఉందో తెలుసుకున్నారు. బ్యాంకులతో ఎదురయ్యే సమస్యలపై సమగ్ర నివేదిక తయారు చేయాలని ఆయన జిల్లా వ్యవసాయాధికారి గోవింద్‌ను ఆదేశించారు. మార్కెటింగ్ శాఖ ద్వారా పత్తి కొనుగోలు సక్రమంగా నడుస్తోందా, ఏవైనా ఇబ్బందులు తలెత్తుతున్నాయో అడిగి తెలుసుకున్నారు. జిల్లాలో జనసాంద్రత ఆధారంగా కొత్త పీహెచ్‌సీలు, సబ్ సెంటర్ల నిర్మాణాలకు ప్రతిపాదనలు పెట్టాలని డీఎంఅండ్ హెచ్‌వో శ్రీరాంను ఆదేశించారు. కొనుగోలు కేంద్రాలను సమర్థంగా నిర్వహించి రైతులకు సకాలంలో డబ్బులు జమ చేసేలా చర్యలు తీసుకోవాలని ఆదేశించారు. సమీక్షలో ఎమ్మెల్యే రోహిత్‌రావు, ఎమ్మెల్సీ శేరి సభాష్‌రెడ్డి, కలెక్టర్ రాహుల్‌రాజ్, అదనపు కలెక్టర్ వెంకటేశ్వర్లు పాల్గొన్నారు.



మెదక్ మెడికల్ కాలేజీ విద్యార్థులతో మంత్రులు, ఎంపీ, ఎమ్మెల్యే, ఎమ్మెల్సీ

### సొంత జిల్లాలోనే సీటు

మెదక్ జిల్లా పెద్దశంకరంపేటకు చెందిన సామాన్య కుటుంబం నుంచి వచ్చిన నాకు సొంత జిల్లాలోనే మెడికల్ సీటు రావడం అదృష్టంగా భావిస్తున్నాను. ప్రజలకు సేవ చేయాలనే పట్టుదలతోనే ఎంబీబీఎస్ సీటు సాధించా. వైద్య కోర్సులను పూర్తి చేసి ఈప్రాంత పేదలకు వైద్య సేవలందిస్తా. ప్రజలకు ఆరోగ్యంపై అవగాహన కల్పించి, రోగాలబారినపడకుండా చైతన్యం చేస్తా.

-నందిని రాథోడ్, పెద్దశంకరంపేట



### అంకితభావంతో సేవలందిస్తా

మా తల్లిదండ్రుల స్వస్థలం బిహార్ అయినా, నేను హైదరాబాద్‌లో పుట్టిపెరిగి విద్యాభ్యాసం చేశాను. కొత్త కళాశాలలో సీటు రావడం సంతోషంగా ఉంది. ఎంబీబీఎస్ కోర్సు పూర్తి చేసి పేదలకు వైద్య సేవలు అందిస్తా. ప్రభుత్వం వైద్య కళాశాలలు ఏర్పాటు చేయడంతో వైద్య విద్యపై ఆసక్తి ఉన్న విద్యార్థులకు ఎంతో ప్రయోజనం కలుగుతుంది. డాక్టర్ కావాలనే నా కలను నిజం చేసే అవకాశం కల్పించిన తెలంగాణ సర్కారుకు రుణపడి ఉంటాం.

-కృష్ణకుందన్‌పాండే, హైదరాబాద్





## పోచమ్మకు బోనం

కోహీర్ మండల పరిధిలోని బిలాల్‌పూర్ గ్రామంలో గురువారం బోనాల పండుగ ఘనంగా నిర్వహించారు. గ్రామంలో నూతనంగా నిర్మించిన పోచమ్మ ఆలయ ప్రారంభోత్సవంలో భాగంగా అమ్మవారికి బోనం నివేదించారు.

-కోహీర్, (ఆంధ్రజ్యోతి)

## ఇది పాఠశాలా? చెత్తకుండీనా?

దౌల్తాబాద్ ఉన్నత పాఠశాల హెచ్‌ఎంపై కలెక్టర్ ఆగ్రహం

హత్నూర, అక్టోబరు 24 (ఆంధ్రజ్యోతి): హత్నూర మండల పరిధిలోని దౌల్తాబాద్ జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలను జిల్లా కలెక్టర్ వల్లూరు క్రాంతి గురువారం ఆకస్మికంగా తనిఖీ చేశారు. విద్యార్థులు, ఉపాధ్యాయుల హాజరు రిజిస్టర్లను పరిశీలించారు. పాఠశాల ఆవరణలో చెత్తాచెదారం కనిపించడంతో పాఠశాల ప్రధానోపాధ్యాయుడిపై ఆగ్రహం వ్యక్తం చేశారు. అనంతరం విద్యార్థుల కోసం పాఠశాలకు తెచ్చిన భోజనాన్ని కలెక్టర్ పరిశీలించారు. విద్యార్థులు ఎక్కువగా ఉన్నారు.. భోజనం మాత్రం తక్కువగా ఉందని హెచ్‌ఎంను ప్రశ్నించగా.. సమాధానం చెప్పడానికి హెచ్‌ఎం తడబడడంతో కలెక్టర్ ఆగ్రహం వ్యక్తంచేశారు. తరగతి గదులను సందర్శించి విద్యార్థులతో మాట్లాడారు. విద్యాబోధన జరుగుతున్న తీరును అడిగి తెలుసుకున్నారు. పాఠశాల ఆవరణకు వెంటనే గేటును ఏర్పాటు చేయాలని గ్రామపంచాయతీ కార్యదర్శిని ఆదేశించారు. కలెక్టర్ వెంట ఆర్డీవో రాజు, తహసీల్దార్ ఫర్హీన్ షేక్, తదితరులు ఉన్నారు.



దౌల్తాబాద్ పాఠశాలలో రికార్డులను పరిశీలిస్తున్న సంగారెడ్డి కలెక్టర్ వల్లూరు క్రాంతి

## సెంట్రల్ జైలును సందర్శించిన సంగారెడ్డి జిల్లా జడ్జి

కంది, అక్టోబరు 24 (ఆంధ్రజ్యోతి) : కందిలోని సెంట్రల్ జైలును సంగారెడ్డి జిల్లా ప్రధాన న్యాయమూర్తి జి.భవానిచంద్ర బుధవారం సందర్శించారు. జైలు మొత్తం కలియతిరిఞ పరిశీలించారు. సదుపాయాలు, భోజనం గురించి ఖైదీలను అడిగి తెలుసుకున్నారు. సమయానికి ములాకత్‌లు అందుతున్నాయా.. లేదా అని ఆరాతీశారు. జైల్లో ఉన్న లీగల్ ఎయిడ్ క్లినిక్ కూడా పరిశీలించారు. న్యాయ సేవలు పొందేందుకు ఉచితంగా న్యాయవాదిని నియమిస్తామన్నారు. కార్యక్రమంలో జిల్లా న్యాయ సేవాధికార సంస్థ కార్యదర్శి బి.రమేష్, జైలు సూపరింటెండెంట్ సంతోష్ కుమార్ రాయ్, జైలు సిబ్బంది తదితరులు పాల్గొన్నారు.



సెంట్రల్ జైలులో ఖైదీలతో మాట్లాడుతున్న జడ్జి

## కరెంటు కాటుకు యువరైతు బలి



నాగరాజు(ఫైల్)

రామాయంపేట, అక్టోబరు 24 (ఆంధ్రజ్యోతి) : కరెంటు కాటుకు యువరైతు బలైన ఘటన మెదక్ జిల్లా రామాయంపేట మండలం ఝాన్సీ లింగాపూర్ లో తీవ్ర విషాదాన్ని నింపింది. గ్రామానికి చెందిన చాకలి నాగరాజు (37) గురువారం ఉదయం పంట పొలానికి నీళ్ల పెట్టేందుకు బోర్ స్టార్టర్ ఆన్ చేయబోయాడు. అప్పటికే అక్కడ ఫ్యూజ్ వైర్లు తెగిపడిన విషయాన్ని గమనించక పోవడంతో షాక్ తగిలి అక్కడికక్కడే ప్రాణాలు విడిచాడు. చుట్టు పక్కల రైతుల ద్వారా విషయం తెలుసుకున్న కుటుంబీకులు పొలం వద్దకు చేరుకొని కన్నీరు మున్నీరుగా విలపించారు. అందరితో కలుపుగోలుగా ఉండే నాగరాజు మృతి పట్ల గ్రామస్తులు సైతం కన్నీళ్ల పెట్టుకున్నారు. మృతునికి భార్య లత తో పాటు పన్నెండేళ్ల లోపు ముగ్గురు పిల్లలు ఉన్నారు.

## ఆటోను ఢీకొన్న వాహనం.. వృద్ధుడి మృతి

అల్లాదుర్గం, అక్టోబరు 24.(ఆంధ్రజ్యోతి) : ఆటోను గుర్తు తెలియని వాహనం ఢీ కొట్టడంతో ఓ వృద్ధుడు మృతి చెందగా.. ఆటో డ్రైవర్‌కు గాయాలయ్యాయి. మండలంలోని సీతానగర్ గ్రామానికి చెందిన చిన్నోళ్ల వెంకయ్య (60) గురువారం పెద్దశంకరంపేటలో జరిగిన సంతకు వెళ్లి ఆటోలో తన నివాసానికి తిరిగి వస్తున్నాడు. ఈ క్రమంలో అల్లాదుర్గం మండలం రాంపూర్ గ్రామ శివారులోని 161వ జాతీయ రహదారి సర్వీస్ రోడ్డులోకి రాగానే గుర్తు తెలియని వాహనం ఆటోను ఢీ కొట్టడంతో వెంకయ్య తలకు బలమైన గాయాలై అక్కడిక్కక్కడే మృతి చెందాడు. ఆటో డ్రైవర్ నాగయ్యకు గాయాలుకాగా, జోగిపేట ప్రభుత్వాసుపత్రికి తరలించారు. ఈ మేరకు పోలీసులు కేసు నమోదు చేసుకు దర్యాప్తు చేస్తున్నారు.

## పురుగుల మందు తాగి రైతు ఆత్మహత్య



మహేందర్‌రెడ్డి

చేర్యాల, అక్టోబరు 24 (ఆంధ్రజ్యోతి) : ఆర్థిక ఇబ్బందులు తాళలేక సిద్దిపేట జిల్లా కొమురవెల్లి మండలం మర్రిముస్త్యాల గ్రామానికి చెందిన వంగ మహేందర్‌రెడ్డి(56) గురువారం పురుగుల మందు తాగి ఆత్మహత్యకు పాల్పడ్డాడు. వ్యవసాయంపై ఆధారపడి జీవిస్తున్న మహేందర్‌రెడ్డికి కొండపాక మండలం విశ్వనాథపల్లి గ్రామరెవిన్యూ పరిధిలో నాలుగు ఎకరాల వ్యవసాయభూమి ఉంది. పంటల సాగుకోసం ఉమ్మడి మెదక్ జిల్లా పరిధిలోని డీసీసీబీ కొండపాక పరిధిలో గతంలో పంటరుణం తీసుకున్నాడు. పంటలు సక్రమంగా పండకపోవడంతో రూ.2.02లక్షల వరకు అప్పులు పేరుకుపోయాయి. ప్రభుత్వం ఇటీవల పంటరుణమాఫీ చేపట్టడంతో బకాయి తీరుతుందని భావించాడు. కానీ రూ.2లక్షలకు పైగా బకాయి ఉండటంతో మాఫీకి నోచుకోలేదు. కుమారుడు హైదరాబాదులో ప్రైవేట్ జాబ్ చేస్తుండగా, మహేందర్‌రెడ్డి, భార్యతో కలిసి వ్యవసాయం చేసుకుంటూ జీవిస్తున్నాడు. ఈక్రమంలో గురువారం ఉదయం భార్యతో కలిసి వ్యవసాయ బావి వద్దకు వెళ్లగా, వరికి పిచికారీ చేసేందుకు పురుగులమందు తీసుకు వస్తానని చెప్పిన మోహన్‌రెడ్డి ఇంటివద్ద పురుగులమందు తాగి ఆత్మహత్యయత్నానికి పాల్పడ్డాడు. గమనించిన స్థానికులు చికిత్స నిమిత్తం సిద్దిపేట ఏరియా ఆస్పత్రికి తరలిస్తుండగా మార్గంమధ్యలో మృతి చెందాడు. ఈ మేరకు కేసు నమోదు చేసినట్లు ఎస్ఐ రాజు తెలిపారు. ప్రభుత్వం రుణమాఫీ చేయకపోవడంతోనే మోహన్‌రెడ్డి ఇబ్బందులపాలై ఆత్మహత్య చేసుకున్నాడని, ఆయనది ప్రభుత్వ హత్యేనంటూ బీఆర్ఎస్ నేతలు ఆరోపించారు.

## మద్యం మానేయమన్నందుకు వ్యక్తి..

దుబ్బాక, అక్టోబరు24(ఆంధ్రజ్యోతి): దుబ్బాక మండలం పెద్దగుండవెల్లి గ్రామానికి చెందిన పంజ శ్రీనివాస్ (54)కు ఇటీవల గుండె ఆపరేషన్ జరిగింది. వైద్యుల సూచన మెరకు మద్యం తాగవద్దని భార్య చెప్పినా వినడంలేదు. బుధవారం రాత్రి కూడా మద్యం తాగి వచ్చిన భర్తను భార్య రాజమణి నిలదీసి గొడవపడడంతో పురుగులమందు తాగాడు. వెంటనే ఆసుపత్రికి తరలించగా చికిత్స పొందుతూ గురువారం మృతిచెందాడు.

## ఉమ్మడి జిల్లా ఫుట్‌బాల్ క్రీడాకారుల ఎంపిక

మెదక్ అర్బన్, అక్టోబరు 24(ఆంధ్రజ్యోతి): ఉమ్మడి మెదక్ జిల్లా ఫుట్‌బాల్ క్రీడాకారుల ఎంపిక పోటీలు గురవారం మెదక్ అవుట్ డోర్ స్టేడియంలో జరిగాయి. ఈ పోటీలకు మెదక్, సంగారెడ్డి, జహీరాబాద్, సదాశివపేట, సిద్దిపేట, గజ్వేల్ ప్రాంతాల నుంచి 120 మంది క్రీడాకారులు హాజరయ్యారు. పోటీలో అత్యుత్తమ ప్రదర్శన కనబరిచిన నలుగురు అరుణ్‌దినాకరణ్, శ్రీకాంత్, సాదీ, జాన్‌పాల్‌లను ఎంపిక చేశారు. ఈ నెల 25 నుంచి 30 వరకు హైదరాబాద్ జింఖానా గ్రౌండ్‌లో జరిగే జాతీయ స్థాయి పోటీల కోసం వారు శిక్షణ శిబిరంలో పాల్గొంటారని జిల్లా ఫుట్‌బాల్ అసోసియేషన్ కార్యదర్శి నాగారాజు తెలిపారు.

### తెలంగాణ బుక్ ఆఫ్ రికార్డులో చోటు



అంతరించిపోతున్న చేపల జాతుల మీద పరిశోధన చేశాను. ఇందుకుగాను తెలంగాణ బుక్ ఆఫ్ రికార్డులో చోటు దక్కింది. ఈ గౌరవం దక్కడానికి నా అధ్యాపక బృందం అందించిన ప్రోత్సాహం చాలా ఉంది. ఈ కోర్సు వల్ల స్వయం ఉపాధి పొందే అవకాశం ఉంటుంది. ఆక్వా కల్చర్‌కు సంబంధించి రైతుల్లో అవగాహన కల్పించినట్లయితే మంచి ఫలితాలు వస్తాయి.

**- బుక్యా సాయికుమార్, విద్యార్థి**

### ఆక్వా కల్చర్‌పై అవగాహన పెరగాలి



మాది జగిత్యాల జిల్లా. నేను డిగ్రీ, పీజీ కూడా ఇదే కాలేజ్‌లో చదివాను. ఆంధ్రాలో ఎక్కువగా అవకాశాలు ఉంటాయి. అక్కడి మాదిరిగానే ఇక్కడ కూడా ఆక్వా కల్చర్‌పై అవగాహన పెంచాలి. ఆక్వా కల్చర్ చేయడానికి ఉపయోగపడే రీసెర్చ్ చేయడానికి కాలేజ్‌లో అన్ని ఏర్పాట్లు ఉన్నాయి. అధ్యాపకుల సహకారంతో పరిశోధనలు చేస్తున్నాం.

**- నవ్యశ్రీ, విద్యార్థిని**

# చేపల ప్రయోగశాల

## సిద్దిపేటలో రాష్ట్రంలోనే మొదటి పీజీ కోర్సు

- అందుబాటులో ఎమ్మెస్సీ ఫిషరీస్
- పరిశోధనతో పాటు ఉపాధి మార్గాలు
- చేపల కొలను, ప్రత్యేక మ్యూజియం
- ఆక్వా క్లినిక్స్ ద్వారా ఫీడ్, సీడ్




కళాశాలలో ఏర్పాటు చేసిన చేపల కొలను (ఫిష్ పాండ్)

సిద్దిపేట కల్చరల్, అక్టోబరు 24 (ఆంధ్రజ్యోతి) : చదువుతో పాటు ఉపాధికి ఊతమిచ్చే కోర్సులు ఎన్నో. అలా భరోసా కల్పిస్తున్న కోర్సుల్లో ఒకటే ఎమ్మెస్సీ ఫిషరీస్. సిద్దిపేటలోని ప్రభుత్వ డిగ్రీ కళాశాల అనుబంధ పీజీ కాలేజ్‌లో ఎమ్మెస్సీ ఫిషరీస్ కోర్సు అందుబాటులో ఉంది. రాష్ట్రం మొత్తంలో ఫిషరీస్‌లో పీజీ స్థాయి కోర్సు సిద్దిపేటలో ఉండడం విశేషం. ఈ కోర్సు ద్వారా ఉపాధి అవకాశాలను అందిపుచ్చుకోవటమే కాకుండా మత్స్య సంపదను కాపాడేందుకు కొత్త మార్గాలను అన్వేషిస్తూ, సరికొత్త పరిశోధనలకు నాంది పలుకుతున్నారు. ఇక్కడి విద్యార్థి 45 రకాల చేప జాతులను సేకరించి తెలంగాణ బుక్ ఆఫ్ రికార్డులో చోటు సంపాదించాడు. మరికొంతమంది కర్ణాటక, ఆంధ్రప్రదేశ్‌లో ఉద్యోగాల్లో స్థిరపడ్డారు. కొందరు ఇంటర్నేషనల్ జర్నల్స్ రాసి పలువురి మెప్పు పొందుతున్నారు.



ప్రత్యేక మ్యూజియంలో భద్రపరిచిన వివిధరకాల చేపల నమునాలు

### ప్రస్తుతం ఆరో బ్యాచ్

2017-18 విద్యా సంవత్సరం నుంచి ఎమ్మెస్సీ ఫిషరీస్ కోర్సు మంజూరైంది. ప్రస్తుతం ఆరో బ్యాచ్ నడుస్తున్నది. గతేడాదే సీట్లను రెండింతలు చేయగా ప్రస్తుతం ఈ విభాగంలో 60 సీట్లు ఉన్నాయి. డిగ్రీ బీఎస్సీ తర్వాత ఎమ్మెస్సీ జువాలజీలో ఆప్షనల్‌గా ఫిషరీస్‌ను ఎంచుకోవచ్చు. దోస్త్ ద్వారా డిగ్రీ అడ్మిషన్లు మొదలయ్యాక విద్యార్థుల సంఖ్య గణనీయంగా పెరిగింది. ఇతర జిల్లాల నుంచి కోర్సును అభ్యసించడానికి వస్తున్నారు.

### 400 రకాల చేపల నమూనాలు

విద్యార్థుల అభ్యసనం కోసం చేపల కొలను(ఫిష్ పాండ్), ప్రత్యేక



ల్యాబ్‌లో పరిశోధన చేస్తున్న ఫిషరీస్ స్టూడెంట్స్

మ్యూజియం ఏర్పాటు చేసి సుమారు 400 రకాల చేపల నమునాలను భద్రపరిచారు. ఆక్వా సిస్టంకు సంబంధించిన అధునాతన వ్యవస్థలైన ఆర్ఏఎస్, బయోప్లాక్ విధానాలతో విద్యార్థులను పరిశోధనల వైపు ప్రోత్సహిస్తున్నారు. ఆక్వా కల్చర్ కోసం తక్కువ ఖర్చులో ఎక్కువ ఉత్పత్తిని దృష్టిలో పెట్టుకుని హేచరీల నిర్మాణం చేపట్టారు. సహజ పద్ధతిలో చేపల ఉత్పత్తికి కృషి చేస్తున్నారు.

### ఆక్వా క్లినిక్

గ్రామాల్లో చిన్న చిన్న కుంటలు, చెరువులను తీసుకుని చేపల పెంపకం చేస్తున్నారు. కొంతమంది విద్యార్థులు ఆక్వా క్లినిక్స్ ఏర్పాటు చేసి చేపల పెంపకందారులకు అవసరమయ్యే సలహాలు, సూచనలు అందిస్తున్నారు. ఆక్వా క్లినిక్స్ ద్వారా సీడ్ సప్లైతో పాటుగా వాటికి అవసరయ్యే ఫీడ్‌ను కూడా సరఫరా చేస్తున్నారు. చేపలకు వ్యాధులు సంక్రమిస్తే అందుకు సంబంధించిన మెడిసిన్‌ను అందిస్తున్నారు. వాటర్ పారామీటర్‌ను పరీక్షించి రైతులు తీసుకోవాల్సిన జాగ్రత్తలను చెబుతున్నారు. నీళ్ల, గోధుమల ద్వారా పారామిశీయం కల్చర్ చేసి చేప పిల్లలకు ఆహారంగా ఇస్తున్నారు. ఇదంతా అధ్యాపకుల పర్యవేక్షణలో విద్యార్థులే చేస్తుంటారు.



ఎమ్మెసీ ఫిషరీస్ విభాగం

### ఉద్యోగావకాశాలుంటాయని చేరాను



మాది జయశంకర్ భూపాలపల్లి జిల్లా. ఫిషరీస్ చదవటం వల్ల ఉద్యోగ, ఉపాధి అవకాశాలు ఉంటాయని ఈ కోర్సు చేస్తున్నాను. కొత్త కోర్సు కాబట్టి ఎక్కువ అవకాశాలను అందిపుచ్చుకోవచ్చు. అందుకనుగుణంగా ఇక్కడ బోధన జరుగుతుంది. భవిష్యత్‌లో ఉపయోగపడే పరిశోధనలను నేర్చుకోవటం బాగుంది.

**- ప్రతిభారాణి, విద్యార్థిని**

### మత్స్య పరిశోధన కేంద్రం ఏర్పాటు చేయాలి



విద్యార్థులకు ఫిషరీస్ కోర్సు వల్ల ఉపాధి, ఉద్యోగ అవకాశాలుంటాయి. విద్యార్థులకు పరిశోధన జ్ఞానం పెరిగేవిధంగా వివిధ రకాలైన ఆక్వాపోనిక్స్, రాస్, హేచరీస్, బయోప్లాక్ వంటి సిస్టమ్‌ను ఏర్పాటు చేశాం. కళాశాలలో మత్స్య పరిశోధన కేంద్రం ఏర్పాటు చేసినట్లయితే విద్యార్థులతో పాటుగా రైతులకు ఎంతో మేలు జరుగుతోంది.

**- అయోధ్యరెడ్డి, ఫిషరీస్ విభాగాధిపతి, వైస్ ప్రిన్సిపాల్**

## కాంగ్రెస్, బీఆర్‌ఎస్ నాయకుల బాహాబాహీ

- కొనుగోలు కేంద్రంలో ప్రారంభంలో ఘర్షణ
- ఇరు వర్గాల మధ్య తోపులాట



కొనుగోలు కేంద్రం వద్ద కాంగ్రెస్, బీఆర్ఎస్ నాయకులు వాగ్వాదం

శివ్వంపేట, అక్టోబరు 24 (ఆంధ్రజ్యోతి): కొనుగోలు కేంద్రం ప్రారంభోత్సవం సందర్భంగా కాంగ్రెస్, బీఆర్ఎస్ నాయకుల మధ్య ఘర్షణ నెలకొంది. దీంతో బాహాబాహీకి దిగడంతో తోపులాట జరిగింది. గురువారం మెదక్ జిల్లా శివ్వంపేట మండలంలోని పీఏసీఎస్ ఆధ్వర్యంలో పెద్ద గొట్టిముక్కుల, శివ్వంపేట, రత్నాపూర్‌లో ధాన్యం కొనుగోలు కేంద్రాలు ప్రారంభోత్సవం ఉదయం 10.30 గంటలకు ఎమ్మెల్యే సునీతారెడ్డిచే ప్రారంభించేందుకు ఏర్పాట్లు పూర్తిచేశారు. కాగా హత్నూర మండలం దౌల్తాబాద్‌లో ఆరోగ్యశాఖ మంత్రి దామోదర్ రాజనర్సింహ పర్యటన నేపథ్యంలో ఎమ్మెల్యే సునీతారెడ్డి రావడానికి ఆలస్యమవుతుందని సీఈవో మధుకు సమాచారం ఇవ్వడంతో కాంగ్రెస్‌కు చెందిన పీఏసీఎస్ చైర్మన్ వెంకట్రామిరెడ్డి కొనుగోలు కేంద్రాన్ని ప్రారంభించారు. తర్వాత శివ్వంపేట పీఏసీఎస్ కార్యాలయం ఎదుట కొనుగోలు కేంద్రం ప్రారంభోత్సవానికి వెంకట్రామిరెడ్డి రాగా.. ఎమ్మెల్యే సునీతా రెడ్డి వచ్చేవరకూ ప్రారంభించొద్దని బీఆర్ఎస్‌కు చెందిన డైరెక్టర్ యాదగౌడ్, పెంటగౌడ్ అనడంతో.. ఇరుపార్టీలకు చెందిన నాయకులు బాహాబాహికి దిగి.. తోపులాడుకున్నారు. దీంతో అక్కడ ఘర్షణ వాతావరణం ఏర్పడింది. కాంగ్రెస్ జిందాబాద్.. బీఆర్ఎస్ జిందాబాద్ అంటూ ఇరువర్గీయులు పెద్దఎత్తున నినాదాలు చేసుకున్నారు. చివరకు పీఏసీఎస్ చైర్మన్ వెంకట్రామిరెడ్డి కొనుగోలు కేంద్రాన్ని ప్రారంభించారు. విషయం తెలుసుకున్న ఎస్ఐ మహిపాల్‌రెడ్డి వచ్చి ఇరువర్గాలకు నచ్చజెప్పడంతో గొడవ సద్దుమణిగింది.

## ప్రేమ విఫలమైందని యువకుడు ఆత్మహత్య

సిద్దిపేట క్రైం, అక్టోబరు 24 (ఆంధ్రజ్యోతి) : ప్రేమ విఫలమైందని యువకుడు ఆత్మహత్య చేసుకున్న సంఘటన సిద్దిపేట పట్టణంలో గురువారం వెలుగులోకి వచ్చింది. వన్ టౌన్ పోలీసుల వివరాల ప్రకారం పట్టణానికి చెందిన బోధనకారి విశ్వసాయి(22) మొబైల్ షాప్‌లో పనిచేస్తున్నాడు. పట్టణానికి చెందిన ఓ యువతిని ప్రేమించాడు. కొన్నాళ్లకు వారి మధ్య మనస్పర్థలు రావడంతో దూరమయ్యారు. దీంతో తన ప్రేమ విఫలమైందనదంటూ తల్లి జయమ్మకు, కుటుంబ సభ్యులతో తరచూ ఆవేదన వ్యక్తం చేస్తుండేవారు. ఈ క్రమంలో బుధవారం రాత్రి 10.30 గంటలకు బయటకు వెళ్లి వస్తానని ఇంట్లో చెప్పి వెళ్లాడు. అనంతరం కోమటి చెరువులో దూకి చనిపోతున్నానంటూ విశ్వసాయి తన స్నేహితులకు ఫోన్ ద్వారా మెసేజ్ పంపించాడు. సమాచారం అందుకున్న కుటుంబ సభ్యులు అదేరాత్రి అక్కడికి చేరుకుని గజ ఈత గాళ్లతో బయటకు తీసిన యువకుడిని సిద్దిపేట ప్రభుత్వ ఆసుపత్రికి తరలించగా అప్పటికే ఆ మృతి చెందాడని వైద్యులు చెప్పారు.

## విలీనంపై వివాదం

ఐదో పేజీ తరువాయి

ఏర్పాట్లు ఉంటాయని చెబుతున్నారు. వీటన్నింటి దృష్ట్యా హైదరాబాద్ ఏ జోన్‌లో ఉంటే ఆ జోన్‌లోనే మార్పు చేయాలని కోరుతున్నారు. తాజాగా టీఎన్జీవో ఉద్యోగులు మంత్రులకు, ఉద్యోగ సంఘాల నేతలకు వినతిపత్రాలు ఇవ్వడం ప్రారంభించారు.

### హుస్నాబాద్ నుంచి అభ్యంతరాలు

భౌగోళిక పరిస్థితి దృష్ట్యా తమకు కరీంనగర్ జిల్లాతోనే సంబంధాలు ఉంటాయని, తమకు సిద్దిపేట జిల్లా ఎడమచేతి వాటంగా ఉందని హుస్నాబాద్ నియోజకవర్గం నుంచి అభ్యంతరాలు వస్తున్నాయి. కొత్త జిల్లాల ఏర్పాటు సమయంలో కరీంనగర్ జిల్లాలో ఉన్న హుస్నాబాద్ నియోజకవర్గ కేంద్రంతోపాటు అక్కన్నపేట, కోహెడ, బెజ్జంకి మండలాలను సిద్దిపేటలో విలీనం చేశారు. ఆనాడు సిద్దిపేట వైపే మొగ్గుచూపారు. ఈ మండలాల అభివృద్ధి విషయంలో నాడు మంత్రిగా ఉన్న హరీశ్‌రావు శ్రద్ధ పెట్టడంతో ఆ ప్రాంత ప్రజలు కూడా సర్దుకున్నారు. అయితే కాలక్రమేణా హుస్నాబాద్ ప్రాంత ప్రజలు మళ్లీ కరీంనగర్ వైపే చూస్తున్నట్లుగా అర్థమవుతోంది. హుస్నాబాద్ ఎమ్మెల్యే, రాష్ట్ర మంత్రి పొన్నం ప్రభాకర్ ఈ విషయంలో గట్టిగా పట్టుబడుతున్నారు. బలవంతంగా సిద్దిపేట జిల్లాలో కలిపిన నాలుగు మండలాలను తిరిగి కరీంనగర్‌లో కలుపుతానని చెబుతున్నారు. ఈ విషయంలో పలు కార్యక్రమాలు చేపట్టిన వారికి ఆయన మద్దతుగా నిలిచారు. ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డి దృష్టికి కూడా ఈ విషయాన్ని తీసుకెళ్లినట్లు తన సన్నిహితుల వద్ద చెప్పినట్లు తెలిసింది.

### మెదక్ కష్టం.. సంగారెడ్డి ఇష్టం

ఉమ్మడి మెదక్ జిల్లాను విభజించిన సమయంలో నాలుగు మండలాలను అశాస్త్రీయంగా విభజిత మెదక్ జిల్లాలో విలీనం చేశారనే విమర్శలు వచ్చాయి. నారాయణఖేడ్ నియోజకవర్గంలో ఉన్న పెద్దశంకరంపేట మండలం, అందోల్ నియోజకవర్గంలోని అల్లాదుర్గం, రేగోడ్, టేక్మాల్ మండలాలను సంగారెడ్డిలోనే ఉంచాలనే విన్నపాలు వస్తున్నాయి. పెద్దశంకరంపేట మండలం విషయంలో అప్పటి నారాయణఖేడ్ ఎమ్మెల్యే భూపాల్‌రెడ్డి అసెంబ్లీలో సైతం మాట్లాడారు. ఇక టేక్మాల్, రేగోడ్, అల్లాదుర్గం మండలాల ప్రజలకు సంగారెడ్డి జిల్లాతోనే సంబంధాలు ఉన్నాయని ప్రస్తుత మంత్రి దామోదర రాజనర్సింహ పలుమార్లు చెప్పుకొచ్చారు. ఈ మూడు మండలాలను తిరిగి సంగారెడ్డి జిల్లాలోనే విలీనం చేయిస్తానని అన్నారు. జోన్ల మార్పులు, చేర్పులు సంబంధిత 317 జీవో చైర్మన్‌గా ఉన్న రాజనర్సింహ ఈ విషయంలో పట్టుబడుతున్నట్లుగా తెలుస్తోంది. ఏదేమైనప్పటికీ జిల్లాలు, జోన్ల మార్పును ఉమ్మడి మెదక్ జిల్లాకు మాత్రమే కాకుండా రాష్ట్ర వ్యాప్తంగా పరిశీలించే అవకాశం ఉంది. ఈ విషయంపై ప్రభుత్వం ఎలాంటి నిర్ణయం తీసుకుంటుందో వేచిచూడాలి.

## మహిళాసాధికారతకు డీడీఎస్ కృషి

- డీడీఎస్ చైర్మన్, ప్రొఫెసర్ బీపీ సంజయ్



సమావేశంలో పాల్గొన్న డీడీఎస్ మహిళాసంఘాల సభ్యులు

జహీరాబాద్, అక్టోబరు 24(ఆంధ్రజ్యోతి) : జహీరాబాద్ ప్రాంతంలోని పస్తాపూర్‌లో 40 ఏళ్ల క్రితం ఏర్పాటైన డీడీఎస్ (డెక్కన్ డెవలప్‌మెంట్ సొసైటి) మహిళా సాధికారిత కోసం కృషి చేస్తున్నదని డీడీఎస్ చైర్మన్ ప్రొఫెసర్ బీపీ సంజయ్ అన్నారు. పట్టణంలోని పస్తాపూర్‌లోని డీడీఎస్ కార్యాలయ ఆవరణలో ఏర్పాటు చేసిన కార్యక్రమంలో ఆయన వర్చువల్‌గా మాట్లాడారు. డీడీఎస్ పనితీరును దేశ, విదేశాల ప్రముఖులు ప్రశంసించారన్నారు. సంస్థతోపాటు చేపట్టే కార్యక్రమాల వివరాలు ఆన్‌లైన్‌లో ఉన్నాయన్నారు. గతంలో పనిచేసి వివిధకారణాలతో బహిష్కరణకు గురైన కొందరు ప్రస్తుతం లేనిపోని ఆరోపణలు చేస్తున్నారని, వారిపై చట్టరీత్య చర్యలు తీసుకునేందుకు వెనుకాడబోమన్నారు. సంఘం సభ్యులు ఆరోపణలను పక్కనబెట్టి పనులతో ముందుకుసాగాలన్నారు.

### బదనాం చేస్తే ఊరుకోము..

నిరుపేద, అనాథ మహిళలకు అక్కున చేర్చుకుని బతుకుబాట నేర్పిన ఘనత దివంగత డీడీఎస్ డైరెక్టర్ పీవీ సతీష్‌కే దక్కిందని ఆ సంస్థ జాయింట్ డైరెక్టర్ గిరిధర్, డీడీఎస్ మహిళాసంఘాల సభ్యులు నాగమ్మ, నర్సమ్మ, చంద్రమ్మ, మొగులమ్మ, స్వరూపమ్మ, లక్ష్మమ్మ, సూర్యకళ, సరెమ్మ తదితరులు పేర్కొన్నారు. గురువారం నిర్వహించిన విలేకరుల సమావేశంలో వారు మాట్లాడుతూ నిరుపేదలకు అన్నంపెట్టే డీడీఎస్ పనితీరును చూసి జీర్ణించుకోలేక కొందరు లేనిపోని ఆరోపణలు చేస్తున్నారన్నారు. తప్పుడు విమర్శలు చేస్తే ఊరుకునే ప్రసక్తేలేదని హెచ్చరించారు. డీడీఎస్ తమకు తోడ్పాటునందించి బతుకు బాటను నేర్పిందన్నారు. వాస్తవాలుంటే పక్కా ఆధారాలతో డీడీఎస్ సంస్థ అధినేతలతో బహిరంగ చర్చకు రావాలని సవాల్ విసిరారు. డీడీఎస్‌ను అణగదొక్కే ప్రయత్నం మానుకోవాలన్నారు. లేనిపోని ఆరోపణలు చేస్తే సహించబోమని, అవసరమైతే డీడీఎస్ పక్షాన రోడ్డెక్కి ఆందోళనలను చేయాల్సి వస్తుందన్నారు.

## ఆలయాల్లో చోరీ నిందితుల అరెస్టు

- ఆరు కేసులను ఛేదించిన గజ్వేల్ డివిజన్ పోలీసులు
- రెండు బైకులు, బంగారం, వెండి, రాతి విగ్రహాలు స్వాధీనం



వివరాలు వెల్లడిస్తున్న ఏసీపీ పురుషోత్తంరెడ్డి

గజ్వేల్, అక్టోబరు 24(ఆంధ్రజ్యోతి): దేవాలయాల్లో చోరీలకు పాల్పడుతున్న నిందితులను అరెస్టు చేసి రిమాండ్‌కు పంపించారు. దీనికి సబంధించిన వివరాలను ఏసీపీ కార్యాలయంలో గురువారం ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో ఏసీపీ పురుషోత్తంరెడ్డి వెల్లడించారు. మంగోల్ చౌరస్తాలో వాహన తనిఖీలు చేస్తుండగా రెండు మోటార్‌సైకిళ్లపై ఇద్దరు వ్యక్తులు అనుమానాస్పదంగా కనిపించగా అదుపులోకి తీసుకుని విచారించగా పలు ఆలయాల్లో చోరీకి పాల్పడినట్లు చెప్పారు. వివరాల్లోకి వెళ్తే గజ్వేల్ పట్టణంలోని డబుల్ బెడ్ రూమ్ ఇండ్ల కాలనీకి చెందిన పర్వతం నర్సింహులు, పర్వతం పరుశరాములు అదే కాలనీకి చెందిన నూనె కుమార్, మోతె(తుప్పతి) సాదుల్లా అక్టోబరు మొదటివారంలో కుకునూరుపల్లి మండలం మంగోల్ గ్రామంలోని ఎల్లమ్మ గుడిలో హుండీ డబ్బులు, అమ్మవారి బంగారు ముక్కుపుడక, వెండి బొట్టు తస్కరించారు. అలాగే గజ్వేల్ నుంచి ఆరేపల్లి వెళ్తుండగా ఉన్న పెద్దమ్మ గుడిలో దేవతల రాతి విగ్రహాలు, గజ్వేల్‌లోని పాండవుల చెరువు కట్టపై ఉన్న హనుమాన్ దేవాలయంలో మైక్‌సెట్, హుండీ నగదు చోరీ చేశారు. అంతేకాకుండా కొండపాక మండల కేంద్రంలోని శివాలయంలో, రవీంద్రనగర్‌లోని హనుమాన్ దేవాలయాలు చోరీకి పాల్పడ్డారు. చోరీ సొమ్మును అమ్మేందుకు సిద్దిపేటకు వెళ్తుండగా పోలీసులకు పట్టుబడ్డారు. కుకునూరుపల్లి పోలీస్‌స్టేషన్‌లో మూడు దొంగతనాల కేసులు, గజ్వేల్, రాయపోల్ పోలీస్‌స్టేషన్లలో ఒక్కో చోరీ కేసులున్నాయి. ఇక చిన్నకోడూరు పోలీస్‌స్టేషన్ పరిధి విఠలాపూర్‌లోని ఓ ఇంటి ఆవరణలో మంచంపై పడుకున్న మహిళ మెడలో పుస్తెల తాడును పర్వతం నర్సింహులు, దుబ్బాక మండల కేంద్రానికి చెందిన నూనె పర్వతం సంపత్ అపహరించారు. నిందితుల నుంచి రెండు మోటార్ సైకిళ్లు, అమ్మవారి బంగారు ముక్కుపుడక, వెండి నుదుటిబొట్టు, రాతి విగ్రహాలు, మైక్‌సెట్ స్వాధీనం చేసుకున్నట్లు ఏసీపీ తెలిపారు. ఆయా పోలీస్‌స్టేషన్లలో నమోదైన ఆరు కేసులను చాకచక్యంగా ఛేదించిన సిబ్బందిని అభినందించారు.

## ప్రభుత్వ ఆస్పత్రి ఆవరణలో గుర్తుతెలియని యువకుడి మృతదేహం కలకలం

- హత్య చేసి ఒంటికి నిప్పంటించిన దుండగులు



ఘటనా స్థలాన్ని పరిశీలిస్తున్న డీఎస్పీ వెంకట్‌రెడ్డి

చిన్నశంకరంపేట, అక్టోబరు 24 (ఆంధ్రజ్యోతి): మెదక్ జిల్లా చిన్నశంకరంపేట మండల కేంద్రంలోని ప్రభుత్వ ఆసుపత్రి ఆవరణలో గుర్తుతెలియని యువకుడి మృతదేహం గురువారం కలకలం రేపింది. ఉదయం విధులకు చేరుకున్న వైద్య సిబ్బంది ఆసుపత్రి వెనుకాల డోర్ తెరువగానే గుర్తు తెలియని యువకుడి మృతదేహం (30) కనిపించింది. ఒక్కసారిగా బయాందోళనకు గురైన సిబ్బంది వైద్యాధికారి డాక్టర్ సాయిసింధు స్థానిక పోలీసులకు సమాచారం అందించారు. ఎస్ఐ నారాయణగౌడ్ ఘటన స్థలానికి చేరుకొని కాలిన మృతదేహాన్ని పరిశీలించారు. సమాచారం అందుకున్న తూప్రాన్ డీఎస్పీ వెంకట్‌రెడ్డి, రామాయంపేట సీఐ వెంకటరాజాగౌడ్ అక్కడికి చేరుకుని మృతదేహాన్ని పరిశీలించారు. క్లూస్ టీంని రప్పించి ఆధారాలను సేకరించారు. ప్రభుత్వ ఆసుపత్రి పరిసరాలలు, రోడ్డుపై ఉన్న సీసీ కెమెరాల ఫుటేజీని పరిశీలించారు. డీఎస్పీ వెంకట్‌రెడ్డి మీడియాతో మాట్లాడుతూ గురువారం అర్ధరాత్రి దుండగులు యువకుడిని బండరాళ్లతో మోది నిప్పుపెట్టి హత్య చేసి ఉంటారని చెప్పారు. మృతదేహం ఆచూకీ కోసం చిన్నశంకరంపేట ఎస్ఐ 8712657987, రామాయంపేట సీఐ 8712657933 నెంబర్లను సంప్రదించాలన్నారు.

## నేలమట్టమైనా చెదరని జ్ఞాపకం..

- అమరవీరుల స్తూపం ఆవిష్కరణ జరిగి నేటికి 34 ఏళ్లు
- 2000 లో ధ్వంసం.. పీపుల్స్ వార్ చరిత్రను గుర్తు చేస్తున్న శిథిలాలు



హుస్నాబాద్‌లోని ఆసియాలో అతిపెద్ద రెండవ అమరవీరుల స్తూపం(ఫైల్)

హుస్నాబాద్, అక్టోబరు 24 (ఆంధ్రజ్యోతి ) : అది 1990 అక్టోబరు 25.. ఈ ప్రాంత ప్రజల గుండెల్లో నిలిచిపోయిన రోజు. నాటి పీపుల్స్‌వార్, నేటి మావోయిస్టు పార్టీ ఉద్యమ చరిత్ర పుటల్లో సువర్ణక్షరాలతో లిఖించబడిన రోజు. పీడిత ప్రజల విముక్తి కోసం పోరుబాటలో అసువులు బాసిన వారి స్మారకార్థం 1990 హుస్నాబాద్ పట్టణంలో నిర్మించిన ఆసియా ఖండంలోనే రెండవ అతిపెద్ద అమరవీరుల స్తూపాన్ని ఆవిష్కరించిన రోజు. ఇది ఆవిష్కరించి శుక్రవారానికి సరిగ్గా 34 ఏళ్లు అవుతుంది. ఇది పీపుల్స్‌వార్ ఉద్యమ ఆటుపోట్లకు సాక్షిగా నిలుస్తుందని భావించినప్పటికీ ఇది వర్గ పోరులో పదేళ్లలోనే నేల మట్టమైంది. 1989 నుంచి సంవత్సరం పాటు అప్పటి పీపుల్స్‌వార్ ప్రతినిధులు 1972-89 మధ్యకాలంలో ఎదురుకాల్పుల్లో మృతి చెందిన 88 మంది పేర్లతో వారి స్మారకార్థం అక్కన్నపేట రోడ్డులోని ఎత్తైన ప్రదేశంలో 88 అడుగుల ఎత్తుతో గ్రానైట్ రాయితో స్తూపాన్ని నిర్మించారు. దీని నిర్మాణ సమయంలో హుస్నాబాద్ మండలం పందిల్ల గ్రామానికి చెందిన బొమ్మగాని నారాయణ ప్రమాదవశాత్తు మృతి చెందాడు. స్తూప ఆవిష్కరణకు ప్రభుత్వం అభ్యంతరం తెలపడంతో అప్పుడు ఇక్కడ పని చేస్తున్న వయోజన విద్య ప్రాజెక్టు అధికారి శేషుకుమార్, ఎఈ బాల్‌లింగారెడ్డి, ఎంఆర్‌వో రాజమౌళిలను కిడ్నాప్ చేశారు. స్తూపం ఆవిష్కరణకు అవరోధం కల్పించవద్దని స్థానిక దళం డిమాండ్ చేయడంతో 25 అక్టోబర్ 1990న వేలాది ప్రజల మధ్య దీనిని పోరుబాటలో అమరుడైన పులి రాములు తండ్రి స్తూపాన్ని ఆవిష్కరించారు. దీనికి ప్రజాయుద్ధనౌక గద్దర్, విప్లవరచయితల సంఘం నాయకులు వరవరరావు, బాలగోపాల్ వంటి నేతలు హాజరయ్యారు. ఎక్కడ పీపుల్స్ వార్ సంఘటనలకు పాల్పడినా దీనిని ధ్వంసం చేసేందుకు యత్నించారు. అలా మూడుసార్లు దీనిని కూల్చివేసేందుకు ప్రయత్నించడంతో పాక్షికంగా దెబ్బతిన్నది. జనవరి 2000 సంవత్సరంలో హుస్నాబాద్‌లోని మాజీ ఎమ్మెల్యే స్వర్గీయ బొప్పరాజు లక్ష్మీకాంతరావు ఇంటిని నక్సలైట్లు పేల్చివేయడంతో ప్రతిగా గ్రీన్‌టైగర్స్ పేరుతో స్తూపాన్ని డిటోనేటర్లు పెట్టి పూర్తిగా ధ్వంసం చేశారు. భౌతికంగా స్తూపం నేలమట్టమైనా ఈ శిథిలాలు ఈ ప్రాంత పీపుల్స్‌వార్ చరిత్రను జ్ఞాపకం చేస్తూనే ఉన్నాయి. అమరుడైన ప్రజా యుద్ధనౌక గద్దర్ ఈ స్తూపాన్ని మళ్లీ నిర్మించాలని ఆకాంక్షించేవారు. పలు మార్లు దీనిని సందర్శించి ఉద్యమ నెత్తుటి చరిత్రను ఆటపాటలతో వివరించేవారు. కాగా ఇటీవల నియోజకవర్గ జేఏసీ ఆధ్వర్యంలో గద్దర్, జర్నలిస్టు జహిరొద్దీన్ అలీఖాన్ వర్ధంతితోపాటు ప్రొఫెసర్ జయశంకర్ సార్ జయంతిని స్తూపం వద్ద నిర్వహించారు. దీనికి మంత్రి పొన్నం ప్రభాకర్ హాజరు కాగా స్తూపాన్ని మళ్లీ నిర్మించాలని పలువురు కోరారు.



స్తూపం కూలినప్పటి దృశ్యం(ఫైల్)

## క్రైం కార్నర్

### కుటుంబ కలహాలతో వ్యక్తి ఆత్మహత్య


నరసింహ మృతదేహం

మాసాయిపేట, అక్టోబరు 24 (ఆంధ్రజ్యోతి): కుటుంబ కలహాలతో వ్యక్తి ఆత్మహత్యకు పాల్పడ్డాడు. మాసాయిపేట మండలం చెట్ల తిమ్మాయిపల్లి పులిగుట్టతండాకు చెందిన మాలోత్ నరసింహ(46) ఇంట్లో తరచూ గొడవపడేవాడు. ఈ క్రమంలో మనస్తాపానికి గురైన నరసింహ గురువారం తెల్లవారుజామున పొలం వద్దకెళ్లి ఉరేసుకుని ఆత్మహత్యకు పాల్పడ్డాడు. మృతుడి భార్య శాంతి ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసుకుని, పోస్టుమార్టం నిమిత్తం మృతదేహాన్ని తూప్రాన్ ప్రభుత్వాస్పత్రికి తరలించారు. ఈ మేరకు కేసు నమోదు చేసుకుని దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్‌ఐ చైతన్యకుమార్‌రెడ్డి తెలిపారు.

### వ్యక్తి అదృశ్యం


మహ్మద్ యూసుఫ్(ఫైల్)

రాయికోడ్, అక్టోబరు 24 (ఆంధ్రజ్యోతి): వ్యక్తి అదృశ్యమైన సంఘటన మండల పరిధిలోని నాగ్వార్ గ్రామంలో చోటు చేసుకున్నది. గ్రామానికి చెందిన మహ్మద్ యూసుఫ్(49) ఈనెల 18 నుంచి కనిపించకుండాపోయాడు. కుటుంబసభ్యులు బంధువులు, చుట్టుపక్కల వెతికినా ఆచూకీ లభించలేదు. దీంతో కుమారుడు మహ్మద్ ఆసిఫ్ పోలీసులకు ఫిర్యాదు చేశాడు. ఈ మేరకు కేసు నమోదు చేసుకుని దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్‌ఐ నారాయణ తెలిపారు.

### అక్రమంగా తరలిస్తున్న ఎండు గంజాయి స్వాధీనం

- గంజాయి విలువ రూ.33 వేలు
- వ్యక్తికి రిమాండ్

ఝరాసంగం, అక్టోబరు 24 (ఆంధ్రజ్యోతి): ఎండు గంజాయిని తరలిస్తున్న వ్యక్తిని పోలీసులు బర్దీపూర్ గ్రామ సమీపంలో బుధవారం రాత్రి అదుపులోకి తీసుకున్నారు. జహీరాబాద్ రూరల్ సీఐ హనుమంతు, ఎస్‌ఐ నరేష్ వివరాల ప్రకారం.. మండల పరిధిలోని బొప్పన్‌పల్లి గ్రామానికి చెందిన మెతరి అనిల్ కర్ణాటకలోని బీదర్‌కు వెళ్లి అక్కడ పునిత్, జాఫర్‌అలీ, నజీర్‌ల వద్ద కిలో 295 గ్రాముల ఎండు గంజాయిని కొనుగోలు చేసి ద్విచక్ర వాహనంపై వస్తుండగా పట్టుకున్నట్లు తెలిపారు. గంజాయి విలువ సుమారు రూ.33 వేలు ఉంటుందన్నారు. ఈ మేరకు కేసు నమోదు చేసి అనిల్‌ను రిమాండ్‌కు తరలించామన్నారు.





నీటితో కళకళలాడుతున్న నర్సాపూర్ రాయరావు చెరువు, కట్టపై పూల మొక్కల కోసం గుంతలు తీస్తున్న మున్సిపల్ కార్మికులు

# కాలక్షేపానికి నెలవు రాయరావు చెరువు

**పచ్చని చెట్లు.. ఆహ్లాదకరమైన వాతావరణం**

- చెరువు కట్టపై జిమ్ పరికరాల ఏర్పాటు
- మరింత తీర్చిదిద్దితే పెరగనున్న పర్యాటకుల తాకిడి

నర్సాపూర్, అక్టోబరు 24 (ఆంధ్రజ్యోతి): పచ్చని చెట్లు.. ఎత్తైన కొండలు.. చుట్టూ అటవీ ప్రాంతం.. మధ్యలో చెరువుకట్ట.. కట్టపై వాకింగ్ ట్రాక్, జిమ్ పరికరాలు.. ఇలాంటి ఆహ్లాదకర ప్రాంతంలో సేదతీరితే ఆ అనుభూతి చెప్పలేనిది కాదు.. ప్రకృతి రమణీయంగా తీర్చిదిద్దిన అందాలు మెదక్ జిల్లా నర్సాపూర్‌లోని రాయరావు చెరువు సొంతం. ఈ చెరువును చూసేందుకు స్థానికులే కాకుండా నగరవాసులు వస్తుంటారు. దీంతో ఈ చెరువు కట్టను పర్యాటకులకు అనుకూలంగా, ఆకట్టుకునేలా కొంతకాలంగా మున్సిపాలిటీ ప్రయత్నిస్తూనే ఉన్నది. అందులో భాగంగా కట్టపై వాకింగ్‌తో పాటు జిమ్‌ను ఏర్పాటు చేశారు. ఉదయం, సాయంత్రం వాకింగ్ చేయడానికి స్థానికులు పెద్దఎత్తున వస్తుండటంతో కట్టపై సందడి నెలకొన్నది. ఆదివారం ఇతర ప్రాంతాల నుంచి కూడా పర్యాటకులు వస్తుండడంతో రాయరావు చెరువు కట్ట.. ఇప్పుడు పర్యాటకంగా ప్రత్యేకతను చాటుకుంటున్నది. వీటితో పాటు మున్సిపల్ ఆధ్వర్యంలో కట్టపై వివిధరకాల పూలమొక్కలతో పాటు అందమైన చెట్లను ప్రత్యేకంగా ఏర్పాటు చేసి వచ్చిన వారికి మరింత ఆహ్లాదం పంచేలా చర్యలు తీసుకుంటున్నారు. ఇవేకాకుండా చెరువు కట్టపై మరిన్ని సదుపాయాలు, సౌకర్యాలు ఏర్పాటు చేస్తే రాయరావు చెరువు మరింత అభివృద్ధి చెంది.. ఈ ప్రాంతానికే ప్రత్యేకతను తెచ్చే అవకాశం ఉన్నది.

**హామీలకే బోటింగ్ పరిమితమా..?**

రాయరావు చెరువులో బోటింగ్ చేస్తే కలిగే ఆనందం అంతా ఇంతా కాదు. కానీ ఈ ప్రాంతవాసులకు ఆ కల నెరవేరడం లేదు. ప్రతీ ఎన్నికల సమయంలో నాయకులు చెరువులో బోటింగ్ ఏర్పాటు చేసేలా కృషి చేస్తామని హామీ ఇస్తున్నారే తప్ప.. ఆ తర్వాత పట్టించుకోవడం లేదన్న విమర్శలు వినిపిస్తున్నాయి. బోటింగ్ ఏర్పాటు చేస్తే స్థానికులకే కాకుండా ఇతర ప్రాంతాల నుంచి వచ్చేవారికి కూడా అనువుగా ఉంటుందని అభిప్రాయం వ్యక్తమవుతున్నది.

**ప్రభుత్వం దృష్టికి తీసుకెళ్తా**



నర్సాపూర్ రాయరావు చెరువు పర్యాటకపరంగా అభివృద్ధి చేయడానికి ఎంతో అనువైన ప్రాంతం. తాను గతంలో ఎమ్మెల్యేగా, మంత్రిగా ఉన్న సమయంలో ఈ చెరువు అభివృద్ధి కోసం ప్రత్యేక దృష్టిసారించి నిధులు వచ్చేలా కృషి చేశాను. ఇప్పుడు కూడా కాంగ్రెస్ ప్రభుత్వం దృష్టికి తీసుకెళ్లి నిధులు తెచ్చేందుకు కృషి చేస్తాను.

\- సునీతారెడ్డి, నర్సాపూర్ ఎమ్మెల్యే

**చెరువును తీర్చిదిద్దేందుకు కృషి**



నర్సాపూర్ రాయరావు చెరువును అన్నివిధాల తీర్చిదిద్దేందుకు ఎప్పటికప్పుడు మున్సిపల్ పాలకవర్గం ప్రత్యేక కృషి చేస్తుంది. రోజూ చెరువుకట్టపై ప్రత్యేకంగా సిబ్బందిని ఏర్పాటుచేసి మొక్కల పెంపకంతో పాటు వాటి సంరక్షణ బాధ్యత చేయిస్తున్నాం. కట్టపై చెత్తాచెదారం లేకుండా చూస్తున్నాం. చెరువును పర్యాటక కేంద్రంగా తీర్చిదిద్దేందుకు అవకాశమున్నా నిధులు లేక ఇబ్బందిగా ఉన్నది.

\- అశోక్‌గౌడ్, మున్సిపల్ చైర్మన్

## రైతుల శ్రేయస్సే ప్రభుత్వ లక్ష్యం: ఎమ్మెల్యే సంజీవరెడ్డి


కల్హేర్ మండలం క్రిష్ణాపూర్‌లో కొనుగోలు కేంద్రాన్ని ప్రారంభిస్తున్న ఎమ్మెల్యే సంజీవరెడ్డి

కల్హేర్/నారాయణఖేడ్/కౌడిపల్లి/చిలప్‌చెడ్/అల్లాదుర్గం/చిన్నశంకరంపేట, అక్టోబరు 24 (ఆంధ్రజ్యోతి): రైతుల శ్రేయస్సు కోసం కృషిచేసేది కాంగ్రెస్ ప్రభుత్వమేనని ఎమ్మెల్యే పి.సంజీవరెడ్డి అన్నారు. మండల పరిధిలోని కిష్టాపూర్, రాపర్తి, నిజాంపేట మండలంలోని బాచేపల్లిలో ధాన్యం కొనుగోలు కేంద్రాలను ప్రారంభించారు. నారాయణఖేడ్ మండలం తుర్కపల్లి, హన్మంత్‌రావుపేట్‌లలో ఐకేపీ ఆధ్వర్యంలో, నిజాంపేట్‌లో డీసీఎంఎస్ ఆధ్వర్యంలో ధాన్యం కొనుగోలు కేంద్రాలను ఎమ్మెల్యే సంజీవరెడ్డి ప్రారంభించారు. అలాగే ఖేడ్‌లోని క్యాంపు కార్యాలయంలో ఖేడ్, నిజాంపేట్, మండలాలకు చెందిన 116 మంది లబ్ధిదారులకు కల్యాణలక్ష్మి, షాదీముబారక్, 37 మందికి సీఎం సహాయనిధి చెక్కులను ఎమ్మెల్యే పంపిణీ చేశారు. కౌడిపల్లి మండల పరిధిలోని వెంకట్రావ్‌పేట్, రాయిలాపూర్, సలవత్‌పూర్, చిలప్‌చెడ్ మండలంలోని పీఏసీఎస్, ఐకేపీ ఆధ్వర్యంలో జగ్గంపేట, గంగారం అజ్జమర్రి, చండూరు, చిలప్‌చెడ్, బండాపోతుగల్, చిట్కుల్‌లో కొనుగోలు కేంద్రాలను ఎమ్మెల్యే సునీతారెడ్డి ప్రారంభించారు. అల్లాదుర్గం మండలంలోని సీతానగర్, కాయిదంపల్లిలో ఐకేపీ ఆధ్వర్యంలో కేంద్రాలను తహసీల్దార్ మల్లయ్య, ఐకేపీ ఏపీఎం నాగరాజు, కాంగ్రెస్ మండలాధ్యక్షుడు శేషారెడ్డి ప్రారంభించారు. చిన్నశంకరంపేట మండలంలోని చందంపేట, సూరారం, ధర్పల్లి, భాగర్తిపల్లి గ్రామాల్లో సొసైటీ చైర్మన్ సత్యనారాయణ ప్రారంభించారు.

**కొనుగోలు కేంద్రాలను ప్రారంభించాలి**

పెద్దశంకరంపేట/మనోహరాబాద్, అక్టోబరు 24 (ఆంధ్రజ్యోతి): పెద్దశంకరంపేట మండల పరిధిలోని ఆయా గ్రామాల్లో ధాన్యం కొనుగోలు కేంద్రాలను త్వరలో ప్రారంభించాలని తహసీల్దార్ గ్రేస్‌బాయ్ అన్నారు. గురువారం పేటలోని తహసీల్దార్ కార్యాలయంలో ఐకేపీ, పీఏసీఎస్ సిబ్బందితో సమావేశం నిర్వహించారు. ఐకేపీ ఆధ్వర్యంలో 7 సెంటర్లు, పీఏసీఎస్ ఆధ్వర్యంలో మూడు కేంద్రాలను మండలంలో ఏర్పాటు చేయనున్నట్లు వివరించారు. ధాన్యం కొనుగోలుపై కలెక్టర్ ఆదేశాల మేరకు మనోహరాబాద్ తహసీల్దార్ కార్యాలయంలో తహసీల్దార్ చంద్రశేఖర్ రెడ్డి ఐకేపీ, పీఏసీఎస్, ఏఈవోలతో సమావేశం నిర్వహించి, పలు సూచనలు చేశారు.

### రైతులు ఆయిల్‌పామ్ తోటలను సాగుచేయాలి

- ట్రైనీ కలెక్టర్ మనోజ్


శంశోద్దీన్‌పూర్‌లో ఆయిల్‌పామ్ తోటను పరిశీలిస్తున్న మనోజ్

రాయికోడ్, అక్టోబరు 24 (ఆంధ్రజ్యోతి): రైతులు ఆయిల్‌పామ్ తోటలను సాగుచేయాలని ట్రైనీ కలెక్టర్ మనోజ్ అన్నారు. గురువారం మండల పరిధిలోని శంశోద్దీన్‌పూర్ గ్రామంలో ఆయిల్‌పామ్ తోటలను పరిశీలించారు. ప్రభుత్వం అందిస్తున్న సబ్సిడీ, డ్రిప్‌కు సంబంధించిన వివరాలను అడిగి తెలుసుకున్నారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ రైతులు ఆయిల్‌పామ్ తోటలను సాగుచేసి ఆర్థికంగా అభివృద్ధి చెందాలన్నారు. కార్యక్రమంలో జిల్లా ఉద్యానవన అధికారులు సోమేశ్వర్, మౌనికరెడ్డి, కంపెనీ ప్రతినిధులు, రైతులు పాల్గొన్నారు.

### బంద్ విజయవంతం


తహసీల్దార్‌కు వినతిపత్రం అందజేస్తున్న దృశ్యం

కల్హేర్/కంగ్టి, అక్టోబరు 24 (ఆంధ్రజ్యోతి): సికింద్రాబాద్, సంగారెడ్డి జిల్లా సదాశివపేటలో హిందూ ఆలయాల్లోని విగ్రహాలను ధ్వంసం చేసిన దుండగులపై కఠిన చర్యలు తీసుకోవాలని డిమాండ్ చేస్తూ గురువారం కల్హేర్‌లో హిందూ సంఘాలు, వివిధ రాజకీయ పార్టీల ఆధ్వర్యంలో బంద్ నిర్వహించారు. ఈ సందర్భంగా ధర్నా చేసి, తహసీల్దార్ శివ శ్రీనివాస్‌కు వినతిపత్రం అందజేశారు. కంగ్టిలో వ్యాపార వాణిజ్య సముదాయాలను స్వచ్ఛందంగా మూసేశారు.

### ముగిసిన ఇర్ఫానీ దర్గా ఉర్సు

సంగారెడ్డి రూరల్, అక్టోబరు 24 (ఆంధ్రజ్యోతి): సంగారెడ్డి మండలం కులబ్‌గూర్ గ్రామ శివారులోని ఇర్ఫానీ దర్గా ఉర్సు ఉత్సవాలు గురువారం ముగిశాయి. ఉత్సవాల్లో భాగంగా గురువారం దీపారాధన, ఖవ్వాలి దతితర కార్యక్రమాలు నిర్వహించారు. దర్గా నిర్వాహకులు హకీమ్ ఒమర్ బిన్ అహ్మద్ సజ్జద్ యే నఫీస్ బార్గ ఇర్ఫానీ ప్రత్యేక ప్రార్థనలు చేశారు.

### ఎల్‌ఆర్‌ఎస్‌పై అవగాహన కలిగి ఉండాలి: అదనపు కలెక్టర్

మెదక్ అర్బన్, అక్టోబరు 24 (ఆంధ్రజ్యోతి): భూముల క్రమబద్ధీకరణకు సంబంధించి జిల్లాలో దాఖలైన ఎల్‌ఆర్‌ఎస్ దరఖాస్తులను త్వరితగతిన పరిష్కరించాలని అదనపు కలెక్టర్ వెంకటేశ్వర్లు అధికారులకు సూచించారు. గురువారం సాయంత్రం ఎల్‌ఆర్‌ఎస్ పురోగతిపై మున్సిపల్ టౌన్ ప్లానింగ్ అధికారులతో కలెక్టరేట్‌లో సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ మున్సిపల్ స్థాయి ఎల్‌ఆర్‌ఎస్ దరఖాస్తుల ప్రక్రియను వేగవంతం చేయాలన్నారు. ఎల్‌ఆర్‌ఎస్‌పై పూర్తి అవగాహన కలిగి ఉండాలన్నారు. ప్రతిరోజు ఎన్ని అప్లికేషన్లు పూర్తి చేశరనే దానిపై వివరాలను నమోదు చేసుకోవాలన్నారు.

### సిజేరియన్ డెలివరీలు ప్రోత్సహించొద్దు: అనిల్‌కుమార్

సంగారెడ్డి అర్బన్, అక్టోబరు 24(ఆంధ్రజ్యోతి) : సిజేరియన్ డెలివరీలు(సీ-సెక్షన్) ప్రోత్సహించవద్దని జీజీహెచ్ సూపరింటెండెంట్ డా.అనిల్‌కుమార్, ప్రభుత్వ మెడికల్ కాలేజీ ప్రిన్సిపాల్ డా.సుధామాధురి సూచించారు. సంగారెడ్డిలోని ఎంసీహెచ్‌లో గైనకాలజీ విభాగం ఆధ్వర్యంలో ప్లాసెంటా అక్రెటాపై గురువారం అవగాహన సదస్సు నిర్వహించారు. ఈ కార్యక్రమంలో గైనకాలజి ప్రొఫెసర్ డా.నాగలక్ష్మి, ఆర్ఎంవోలు వీరాంజనేయులు, పద్మావతి, డాక్టర్లు, సిబ్బంది పాల్గొన్నారు.

### సీఎం సహాయనిధిని సద్వినియోగం చేసుకోవాలి: ఎమ్మెల్యే

జహీరాబాద్, అక్టోబరు 24 (ఆంధ్రజ్యోతి): ప్రభుత్వం నిరుపేదల ఆరోగ్యం కోసం అందజేస్తున్న సీఎం సహాయనిధి పథకాన్ని సద్వినియోగం చేసుకోవాలని జహీరాబాద్ ఎమ్మెల్యే కొనింటి మాణిక్‌రావు పేర్కొన్నారు. గురువారం పట్టణంలోని ఎమ్మెల్యే క్యాంపు కార్యాలయంలో 9మంది లబ్ధిదారులకు రూ.2.74 లక్షల చెక్కులను అందజేశారు.

### బొల్లారం పోలీస్‌స్టేషన్‌ను ఎస్పీ తనిఖీ


మొక్క నాటి నీరు పోస్తున్న ఎస్పీ చెన్నూరి రూపేష్

జిన్నారం, అక్టోబరు 24, (ఆంధ్రజ్యోతి): బొల్లారం పోలీస్‌స్టేషన్‌ను మెదక్ ఎస్పీ చెన్నూరి రూపేష్ తనిఖీ చేశారు. గురువారం బొల్లారం పీఎస్‌ను సందర్శించిన ఎస్పీకి సిబ్బంది గౌరవ వందనం సమర్పించారు. ఈ సందర్భంగా పోలీస్‌స్టేషన్ రికార్డులు, కేసుల నమోదును పరిశీలించారు. అనంతరం పీఎస్ ఆవరణలో మొక్కలు నాటారు. కార్యక్రమంలో అదనపు ఎస్పీ సంజీవరావు, డీఎస్పీ రవీందర్‌రెడ్డి, సీఐ గంగాధర్, ఎస్‌లు, ఇతర సిబ్బంది పాల్గొన్నారు.

### ధర్మారంలో ఆలిండియా సర్వీసెస్ బృందం పర్యటన

రామాయంపేట, అక్టోబరు 24 (ఆంధ్రజ్యోతి): రామాయంపేట మండల పరిధి ధర్మారంలో మూడురోజులుగా ఆలిండియా సర్వీసెస్ బృందం పర్యటిస్తోంది. గురువారం గ్రామ పరిసరాల్లో తిరుగుతూ ప్రజలతో మాట్లాడారు. ప్రభుత్వ పథకాలు అందుతున్నాయా..! మీకు ఎలాంటి సమస్యలు పరిష్కారం కాలేదన్న విషయాలను అడిగి తెలుసుకున్నారు. బృందం వెంట ఎంపీడీవో, వ్యవసాయ, ఉపాధిహామీ సిబ్బంది, కాంగ్రెస్ నాయకులు మల్లేశం ఉన్నారు.

### క్యాన్సర్‌పై పోరాడుదాం... కలిసిరండి

- లయన్స్‌క్లబ్ ఆదర్శ డిస్ట్రిక్ట్ చైర్మన్ రాములుగౌడ్


కరపత్రాన్ని ఆవిష్కరిస్తున్న లయన్స్‌క్లబ్ ఆదర్శ సభ్యులు

సంగారెడ్డి అర్బన్, అక్టోబరు 24(ఆంధ్రజ్యోతి) : ఆదిలోనే గుర్తించి క్యాన్సర్ వ్యాధి నిర్మూలనకు ప్రతి ఒక్కరూ కృషి చేయాలని లయన్స్‌క్లబ్ ఆదర్శ డిస్ట్రిక్ట్ చైర్మన్ రాములుగౌడ్, తారా కళాశాల ప్రిన్సిపాల్ రత్నప్రసాద్ తెలిపారు. సంగారెడ్డిలోని తారా ప్రభుత్వ డిగ్రీ కళాశాలలో లయన్స్ క్లబ్ ఆఫ్ సంగారెడ్డి ఆదర్శ ఆధ్వర్యంలో క్యాన్సర్ వ్యాధి నిర్మూలనపై చేపట్టిన అవగాహన కార్యక్రమం కరపత్రాన్ని గురువారం ఆవిష్కరించారు. ఈ వారోత్సవాలు ఈ నెల 25తో ముగియనున్నాయి. ఈ కార్యక్రమంలో క్లబ్ అధ్యక్షుడు జార్జ్‌మ్యాథ్యూస్, కార్యదర్శి ఎన్.రామప్ప, కోశాధికారి శేషత్వం కృష్ణ, జోన్ చైర్మన్ ఎం.వెంకటేశం, సభ్యులు పాల్గొన్నారు.

### కేసీఆర్, హరీశ్‌రావు కృషితోనే వైద్య కళాశాల

- మున్సిపల్ వైస్ చైర్మన్ ఆరేళ్ల మల్లికార్జున్‌గౌడ్

మెదక్ మున్సిపాలిటీ, అక్టోబరు 24 (ఆంధ్రజ్యోతి): మాజీ ముఖ్యమంత్రి కేసీఆర్, మాజీ వైద్యారోగ్యశాఖ మంత్రి హరీశ్‌రావు కృషితోనే నేడు మెదక్ జిల్లా కేంద్రంలో ప్రభుత్వ వైద్య కళాశాల ప్రారంభించుకోవడం జరిగిందని మున్సిపల్ వైస్ చైర్మన్ ఆరేళ్ల మల్లికార్జున్‌గౌడ్ అన్నారు. గురువారం సాయంత్రం ఆయన విలేరులతో మాట్లాడుతూ బీఆర్‌ఎస్ ప్రభుత్వ హయాంలో కళాశాల మంజూరు విషయంలో స్థలసేకరణ పూర్తిచేయగా, భూమి పూజ సైతం మాజీ ఎమ్మెల్యే పద్మాదేవేందర్‌రెడ్డి కృషి వల్ల చేశామన్న విషయం ప్రజలకు తెలుసునన్నారు. ఇందుకు సంబంధించిన జీవో గతేడాది జూలై 5న బీఆర్‌ఎస్ ప్రభుత్వం విడుదల చేసిందన్నారు. కానీ అధికారంలోకి వచ్చిన కాంగ్రెస్ ప్రభుత్వం డీపీఆర్ (డిటెల్డ్ ప్రాజెక్ట్ రిపోర్ట్) కూడా సిద్ధం చేయించకలేకపోయిందన్నారు. ప్రారంభోత్సవాన్ని స్వాగతిస్తున్నామని.. కానీ 100 సీట్లకు అనుమతివ్వాలని డిమాండ్ చేశారు. ఆయన వెంట కౌన్సిలర్లు వంజరి జయరాజ్, ఆకిరెడ్డి కృష్ణారెడ్డి, భీమరి కిషోర్, ఆర్‌కె శ్రీనివాస్, నాయకులు ఉన్నారు.

### 'ప్రేమతోనే మానవ జన్మకు మోక్షం'

నారాయణఖేడ్, అక్టోబరు 24 (ఆంధ్రజ్యోతి): ప్రేమతత్వంతోనే మానవ జన్మకు మోక్షమని రంగంపేట ఆశ్రమపీఠాధిపతి మాధవానంద సరస్వతీ స్వామి అన్నారు. గురువారం నారాయణ సత్యనారాయణస్వామి ఆలయంలో భక్తులకు ఆశీస్సులు అందిస్తూ మాట్లాడారు. అనంతరం మాజీ ఎమ్మెల్యే భూపాల్‌రెడ్డి మాధవానంద సరస్వతీని దర్శించుకొని ఆశీస్సులు పొందారు. అంతకుముందు మాధవానందస్వామి పట్టణ శివార్లలో నిర్మిస్తున్న మార్కండేయ మందిరాన్ని సందర్శించారు. అలాగే ఎమ్మెల్యే సంజీవరెడ్డి గృహంలో తన సోదరులు చంద్రశేఖర్‌రెడ్డి, సుధాకర్‌రెడ్డి, మాతృమూర్తి కమలమ్మలతో కలిసి పాదపూజ నిర్వహించారు.

### పట్టభద్రుల అభివృద్ధే లక్ష్యంగా సేవలందిస్తా

- పట్టభద్రుల ఎమ్మెల్సీ అభ్యర్థి నరేందర్‌రెడ్డి

సంగారెడ్డి రూరల్, అక్టోబరు 24 (ఆంధ్రజ్యోతి) : పట్టభద్రుల అభివృద్ధే లక్ష్యంగా సేవలందిస్తానని పట్టభద్రుల ఎమ్మెల్సీ అభ్యర్థి నరేందర్‌రెడ్డి అన్నారు. సంగారెడ్డి పట్టణ శివారులోని పోతిరెడ్డిపల్లి చౌరస్తాలో గల ఓ భవనంలో గురువారం నిర్వహించిన విలేకరుల సమావేశంలో ఆయన మాట్లాడారు. వివిధ రంగాల్లో సేవలందించిన తాను ఎమ్మెల్సీ ఎన్నికల ద్వారా ప్రత్యక్ష రాజకీయాల్లో అడుగుపెడుతున్నానని తెలిపారు. తనను గెలిపిస్తే అందరికీ అందుబాటులో ఉంటూ సమస్యల పరిష్కారానికి కృషి చేస్తానని నరేందర్‌రెడ్డి హామీఇచ్చారు.

### 'పిల్లలకు పోషక లోపం లేకుండా చూడాలి'

చేగుంట, అక్టోబరు 24 (ఆంధ్రజ్యోతి): పిల్లలకు పోషకలోపం లేకుండా చూడాలని రామాయంపేట సీడీపీవో స్వరూపారాణి అన్నారు. చేగుంట మండల పరిషత్ కార్యాలయంలో 'సామ్ మ్యామ్ మా' కార్యక్రమంలో భాగంగా బుధవారం ఏఎన్‌ఎం, అంగన్‌వాడీ కార్యకర్తలు, ఆశావర్కర్లకు సమీక్షా సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ పుట్టిన శిశువు నుంచి ఆరేళ్లలోపు పిల్లల బరువు, ఎత్తులో లోపం లేకుండా చూడాలన్నారు. ఈ కార్యక్రమంలో డాక్టర్ అనిల్‌కుమార్ పాల్గొన్నారు.

### కోర్టు ఏర్పాటుకు భవనం పరిశీలన

తూప్రాన్, అక్టోబరు 24 (ఆంధ్రజ్యోతి): తూప్రాన్ పట్టణానికి మంజూరైన జూనియర్ సివిల్ జడ్జి కోర్టు ఏర్పాటుకు భవనం పరిశీలన చేస్తున్నారు. గురువారం తూప్రాన్ పట్టణంలో మోర్ సూపర్ మార్కెట్ పైభవనాన్ని తూప్రాన్ ఆర్డీవో జయచంద్రారెడ్డి పరిశీలించారు. ఈ భవనం కోర్టు ఏర్పాటుకు అనుకూలంగా ఉన్నట్లు అభిప్రాయపడ్డారు. ఆయనతో తహసీల్దార్ విజయలక్ష్మి, న్యాయవాదులు బొడ్డు శ్రీనివాస్, ముత్తిగాళ్ల అశోక్ ఉన్నారు. అనంతరం సీనియర్ జర్నలిస్టు జానకీరాంగౌడ్ డాక్టరేట్ పొందిన సందర్భంగా గురువారం ఏర్పాటు చేసిన సన్మానికి హాజరయ్యారు.

### రైస్ మిల్లు వేలం పాట రూ.6.70 లక్షలు

పాపన్నపేట, అక్టోబరు 24 (ఆంధ్రజ్యోతి): కొత్తపల్లి రైతు సేవా సహకార సంఘం ఆధ్యర్యంలో గల రైస్‌మిల్లు లీజుకు గురువారం వేలం పాట నిర్వహించగా రూ.6.70 లక్షలకు ఖరారు అయ్యింది. ఏడాదిపాటు ఒప్పందం గల ఈ మిల్లు లీజుకు తీసుకునేందుకు 9 మంది మిల్లర్లు వేలం పాటలో పాల్గొనగా పాండురంగం అందరి కంటే ఎక్కువ వేలం పాడి లీజు దక్కించుకున్నాడు. ఈ కార్యక్రమంలో సొసైటీ చైర్మన్ త్యార్ల రమేష్, సీఈవో వెంకటేశ్వర్లు, కోఆపరేటివ్ అసిస్టెంట్ రిజిస్ట్రార్ ఫయాజొద్దీన్, డైరక్టర్లు, సీనియర్ అసిస్టెంట్ రవి, మాజీ జడ్పీటీసీ మల్లప్ప, సిబ్బంది, మిల్లర్లు పాల్గొన్నారు.

## పేదలకు సూపర్ స్పెషాలిటీ సేవలు

5వ పేజీ తరువాయి

జిల్లా ఇన్‌చార్జి మంత్రి కొండా సురేఖ పేర్కొన్నారు. టెక్నాలజీని అందిపుచ్చుకుంటూ నిరంతరం కొత్త విషయాలను నేర్చుకుంటూ వృత్తి నైపుణ్యాలను మెరుగు పర్చుకోవాలన్నారు. ఫ్రైండ్లీ డాక్టర్‌గా ఉంటూ.. రోగులకు సేవలందించాలని యువ డాక్టర్లకు పిలుపునిచ్చారు. ఆత్మస్థైర్యంతో ముందుకెళ్లి తల్లిదండ్రులకు, గురువులకు పేరు ప్రఖ్యాతలు తీసుకురావాలని విద్యార్థులకు సూచించారు.

**ఉచిత వైద్యమే మోదీ సర్కారు లక్ష్యం**

పేదల ఉచిత వైద్యం అందించాలన్నదే ప్రధాని మోదీ లక్ష్యమని ఎంపీ రఘునందన్‌రావు పేర్కొన్నారు. కేంద్ర ప్రభుత్వ కృషితోనే నూతన కళాశాలలు ఏర్పాటు సాధ్యమైందన్నారు. సామాన్యులకు కార్పొరేట్ స్థాయి వైద్యం అందుబాటులోకి రావాలన్న ఉద్దేశంతో కేంద్రం 756 జిల్లాలో 378 మెడికల్ కళాశాలలను ఏర్పాటు చేసిందన్నారు. పేరుకే మెదక్ జిల్లా అని, అభివృద్ధిలో పూర్తిగా వెనుకబడిందన్నారు. వైద్య కళాశాల ఏర్పాటు సంతోషకరమన్నారు. దేశంలో 51 వేల సీట్లు ఉండగా.... కేంద్ర ప్రభుత్వం తీసుకున్న నిర్ణయంతో 2.07 లక్షల సీట్ల వరకు పెంచిందన్నారు. మెడికల్ కళాశాలకు అవసరమైన అధునాతన సౌకర్యాలు కల్పించాలని కోరారు.

**కల సాకారం**

మెదక్ ప్రజల చిరకాల కోరిక వైద్యకల సాకారం ప్రభుత్వ మెడికల్ కళశాల ఏర్పాటుతో నెరవేరిందని ఎమ్మెల్యే డా. మైనంపల్లి రోహిత్‌రావు పేర్కొన్నారు. తాను కూడా వైద్యుడినేనని, మీ కష్టాల్లో పలు పంచుకుంటానని అన్నారు. మెదక్‌లో మెడికల్ కళాశాల ఏర్పాటుకు కృషి చేసిన సీఎం రేవంత్‌రెడ్డి, వైద్య ఆరోగ్యశాఖ మంత్రి దామోదర్ రాజనర్సింహ, జిల్లా యంత్రాంగానికి కృతజ్ఞతలు తెలిపారు. రాబోయే రోజుల్లో ఆధునాతన సౌకర్యాలు కల్పించి, జిల్లాలో మెరుగైన వైద్య సేవలు అందించేలా కృషి చేస్తానని పేర్కొన్నారు.

**బీఆర్‌ఎస్ ప్రభుత్వం కృషితోనే..**

ప్రతీ జిల్లాలో మెడికల్ కళాశాల ఏర్పాటుకు బీఆర్‌ఎస్ సర్కార్ కృషి చేసిందని, మెదక్ వైద్య కళాశాల ఏర్పాటుకు అందరి కృషి ఉందని ఎమ్మెల్సీ శేరి సుభాష్‌రెడ్డి పేర్కొన్నారు. వెనుకబడిన ప్రాంతానికి కళాశాల రావడం జిల్లా ప్రజల అదృష్టంగా భావిస్తున్నామన్నారు. ఈ ప్రాంత ప్రజలకు సేవ చేసే అవకాశం విద్యార్థులకు దొరికిందన్నారు. వైద్య కళాశాలలో పూర్తి సౌకర్యాలు కల్పించి, శాశ్వత భవన నిర్మాణం చేయాలని కోరారు. కలెక్టర్ రాహుల్‌రాజ్ మాట్లాడుతూ మెడికల్ కళాశాల కోసం చాలామంది కష్టపడ్డారని వారి కష్టానికి నేడు ఫలితం దక్కిందన్నారు. కార్యక్రమంలో అదనపు కలెక్టర్ వెంకటేశ్వర్లు, టీజీఐఐసీ చైర్‌పర్సన్ నిర్మల జగ్గారెడ్డి, మాజీ ఎమ్మెల్యే మదన్‌రెడ్డి, మున్సిపల్ చైర్మన్ చంద్రపాల్, వైస్‌చైర్మన్ మల్లికార్జున్‌గౌడ్, డీఎంహెచ్‌వో శ్రీరాం, డీసీహెచ్‌ఎస్ శివదయాల్, ప్రిన్సిపాల్ రవీందర్, నాయకులు, అధికారులు తదితరులు పాల్గొన్నారు.

### కార్పొరేట్‌కు దీటుగా ప్రభుత్వ వైద్యసేవలు

హత్నూర/కొల్చారం, అక్టోబరు 24 (ఆంధ్రజ్యోతి): కార్పొరేట్‌కు దీటుగా ప్రభుత్వ ఆసుపత్రుల్లో నిరుపేదలకు మెరుగైన వైద్య సేవలందించేందుకు ప్రభుత్వం పనిచేస్తున్నదని రాష్ట్ర వైద్య, ఆరోగ్యశాఖ మంత్రి దామోదర్ రాజనర్సింహ అన్నారు. హత్నూర మండలం దౌల్తాబాద్‌లో రూ.1 కోటి 56 లక్షలతో నిర్మించిన ప్రాథమిక ఆరోగ్య కేంద్రాన్ని గురువారం జిల్లా ఇన్‌చార్జి మంత్రి కొండా సురేఖ, కలెక్టర్ వల్లూరు క్రాంతి, టీజీఐఐసీ చైర్మన్ నిర్మలాజగ్గారెడ్డి, ఎమ్మెల్యే సునీతారెడ్డిలతో కలిసి ప్రారంభించి మాట్లాడారు. ఆరోగ్య కేంద్రాన్ని 30 పడకల ఆసుపత్రిగా అభివృద్ధి చేయడానికి అవసరమైన ప్రతిపాదనలు సిద్ధం చేయాలని వైద్యాధికారులను ఆదేశించారు. మాజీ ఎమ్మెల్యే మదన్‌రెడ్డి, మెదక్ జిల్లా గ్రంథాలయ సంస్థ చైర్మన్ సుహాసినిరెడ్డి, జిల్లా వైద్య అధికారి గాయత్రీ, పీసీసీ రాష్ట్ర కార్యదర్శి ఆవుల రాజిరెడ్డి, కాంగ్రెస్ మెదక్ జిల్లా అధ్యక్షుడు ఆంజనేయులుగౌడ్ పాల్గొన్నారు. కాగా హైదరాబాద్ నుంచి మెదక్ వెళ్తున్న మంత్రి దామోదర్ రాజనర్సింహను రాంపూర్ వద్ద కార్యకర్తలు ఆపి శాలువాతో సన్మానించారు.

### వార్డు కమిటీల కథ కంచికేనా?

5వ పేజీ తరువాయి

చర్చించాలి. ఎక్కడెక్కడ అభివృద్ధి పనులు చేయాలో అందుకు సంబంధించిన ప్రతిపాదనలు తయారు చేసి కౌన్సిలర్లకు అందజేయాలి. ఈ కమిటీలు వార్డుల్లో పారిశుధ్యం, తాగునీరు, డ్రైనేజీ విద్యుత్ దీపాలు, రోడ్లు తదితర సమస్యలను గుర్తించి ప్రతీ మూడు నెలలకోసారి జరిగే వార్డు సమావేశంలో అధికారుల దృష్టికి తీసుకువెళ్లాల్సి ఉంటుంది. అయితే జిల్లాలో ఎక్కడా వార్డుకమిటీల సమావేశాలు నిర్వహించడం లేదన్న ఆరోపణలున్నాయి. కమిటీలు గుర్తించిన సమస్యలను అధికారులు పరిష్కరిస్తే కమిటీ సభ్యులు రెట్టింపు ఉత్సాహంతో పనిచేస్తారు. ఉంటుంది. కమిటీల సభ్యులకు ప్రభుత్వం నుంచి, ప్రజాప్రతినిధుల నుంచి ప్రోత్సాహం లేకపోవడంతో నిరుత్సాహానికి లోనవుతున్నారు. కమిటీలు చురుగ్గా పనిచేస్తే వార్డుల్లో అభివృద్ధి పనులు నాణ్యతగా చేపట్టే అవకాశం ఉంటుందని ప్రజలు అభిప్రాయపడుతున్నారు.